జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం








రంగారెడ్డి | బుధవారం 21 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 252 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు ప్రమోషన్




- పాకిస్థాన్‌లో కీలక పరిణామం..
- పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్‌కు పదోన్నతి
- ఫీల్డ్ మార్షల్‌గా ప్రమోషన్ ఇచ్చిన పాక్ ప్రభుత్వం
- దేశంలోనే అత్యున్నత సైనిక హోదాగా గుర్తింపు
- ప్రధాని షెహబాజ్ షరీఫ్ కేబినెట్ సమావేశంలో ఆమోదం
- భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం

## విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలి

- సుప్రీంకోర్టులో వక్ఫ్ చట్టంపై విచారణ
- మధ్యంతర ఉత్తర్వులపై కేంద్రం కీలక సూచన
- వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంలో విచారణ
- మధ్యంతర ఉత్తర్వులు మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరిన కేంద్రం
- కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు
- కేంద్రం వాదనను వ్యతిరేకించిన పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కపిల్ సిబల్, మనుసింఘ్వీ





## మళ్లీ కోవిడ్ కలవరం

- దేశంలో 257 యాక్టివ్ కేసులు
- ముంబైలోనే 53 కేసులు నమోదు
- ఆందోళన అవసరం లేదన్న వైద్యులు




ఏపీలో విద్యాసంస్కరణలపై

## దేశ వ్యాప్తంగా చర్చ

### ఈనాటి షైనింగ్ స్టార్లే ఏపీ విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లు

**అమరావతి**

ఏపీలో విద్యాసంస్కరణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈనాటి షైనింగ్ స్టార్లే ఏపీ విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ స్కూళ్ల ఉత్తమ విద్యార్థులతో యాడ్స్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కష్టపడి పనిచేయడంలో చంద్రబాబుని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. షైనింగ్ స్టార్స్ పేరుతో ఉత్తమ - మిగతా3లో

# రేషన్ స్థానంలో నగదు బదిలీ

- ఏపీఐఐసీకి 615 ఎకరాల కేటాయింపు.. ఏపీ కేబినెట్ నిర్ణయం
- సౌర విద్యుత్, పవన విద్యుత్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం
- త్వరలోనే విద్యుత్ ఇంధన వనరుల కేంద్రంగా మారనున్న అనంతపురం
- డైకిన్ ఏసీ తయారీ సంస్థకు శ్రీసిటీలో విస్తరణకు అనుమతి
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏలూరు వద్ద ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం
- మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చ
- బియ్యం ఇచ్చే రోజు తప్ప రేషన్ వాహనాల వల్ల ఉపయోగం లేదు
- వికలాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి
- మిగిలిన వారికి రేషన్ దుకాణాల ద్వారానే ఇకపై బియ్యం పంపిణీ
- పలు చోట్ల ఛైర్మన్, ఉప ఛైర్మన్ ఎన్నిక వాయిదా సరికాదు



**అమరావతి:**

ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. సమావేశంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను సమాచార శాఖమంత్రి కొలుసు పార్థ సారధి మీడియాకు వివరించారు. విశాఖ డిప్యూటీ మేయర్‌తో పాటు పలు చోట్ల ఛైర్మన్, ఉప ఛైర్మన్ ఎన్నిక వాయిదా సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు ఇలాంటివి జరగకుండా బాధ్యత తీసుకోవాలని సూచించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం తాజా రాజకీయ అంశాలపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు. బియ్యం ఇచ్చే రోజు తప్ప రేషన్ వాహనాల వల్ల ఉపయోగం లేదని మంత్రులు అభిప్రాయపడ్డారు. వికలాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలిన వారికి రేషన్ దుకాణాల ద్వారానే ఇకపై బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. వాహనాల ద్వారా రేషన్ సరఫరా వల్ల స్మగ్లింగ్‌కు అవకాశం ఇస్తూ పథకం దుర్వినియోగం జరుగుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దుకాణంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు - మిగతా3లో



## మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు!

- కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు
- ఈసారి సాధారణం కంటే అధిక వర్షపాతం
- రెండు రోజుల ముందే రానున్నాయని మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి తాజాగా అంచనా



## జూన్ 5లోగా విచారణకు రండి

### కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు

**హైదరాబాద్**

తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. కాళేశ్వరంపై విచారణ కమిషన్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌లకు నోటీసులు ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో, బీఆర్ఎస్ పాలన సమయంలో కేసీఆర్ సీఎం కాగా, నీటిపారుదలశాఖా మంత్రిగా హరీష్ రావు, ఆర్థికశాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పనిచేశారు. 15 రోజుల్లో విచారణకు హాజరు కావాలని నోటీసులలో కమిషన్ పేర్కొంది. జూన్ 5వ తేదీలోగా విచారణకు - మిగతా3లో

## ఇద్దరు విఖ్యాత శాస్త్రవేత్తల అస్తమయం

- అణుశాస్త్రవేత్తగా ఖ్యాతికెక్కిన ఎం.ఆర్.శ్రీనివాసన్
- ఖగోళ భౌతిక శాస్త్రవేత్తగా ప్రసిద్ధి గాంచిన జయంత్ విష్ణు నార్లికర్

## 'డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రం'పై చట్టపరమైన చర్యలు



- టీటీడీ పాలకమండలి నిర్ణయం
- నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం
- సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు
- శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసిన సినిమా బృందంపై చర్యలకు ఆమోదం
- తిరుమల కొండల్లో పచ్చదనం 80 శాతానికి పెంపు
- స్విమ్స్‌కు అదనపు చేయూత ఇవ్వాలని నిర్ణయం

**తిరుపతి**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఈ ఉదయం జరిగిన సమావేశంలో భక్తుల సౌకర్యాలు, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, వైద్య సేవలు, భద్రతాంశాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా, శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా - మిగతా3లో



### ప్రావిన్స్ దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోంది

- బలోచిస్థాన్'పై సీఎం హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు..
- 'బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీగా ఖనిజ సంపద ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోంది.
- దశాబ్దాల తరబడి ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ ఎక్కువైంది.

## మనకూ టైం వస్తుంది.. వాళ్లకు సినిమా చూపిస్తాం

- మనం అన్నీచేసి 30శాతం పనులు చేశాం
- రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా అభివృద్ధి పనులు కేవలం వైయస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయి
- ఈరోజు ఇవన్నీ నాశనం అయిపోతున్నాయి
- వ్యవస్థలను చంద్రబాబు నాశనం చేస్తున్నాడు
- ప్రజలను వెన్నుపోటు పొడిచాడు
- ఎవరూ ప్రశ్నించకూడదని భయానక పరిస్థితులను తీసుకు వచ్చాడు
- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు
- న్యాయాలు చేసిన ఒక్కొక్కరికి సినిమాలు చూపిస్తాం




**తాడేపల్లి**

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకూ భయపడకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. తెగువ, ధైర్యం ఉంటేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు అలా ఉన్నాయి:" అంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో మంగళవారం వైఎస్ జగన్ భేటీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులతో సమావేశమైన వైఎస్ జగన్.. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. "మన హయాంలో ఈ తరహా రాజకీయాలు చేయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం స్వీప్ చేశాం. తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి 18, మనకు 16. టీడీపీ వాళ్లని లాక్కుందామని ఎమ్మెల్యే - మిగతా3లో

# ఇద్దరు విఖ్యాత శాస్త్రవేత్తల అస్తమయం

పుణెబీ చెన్నై

దేశ విజ్ఞాన రంగ వినీలాకాశంలో ధ్రువతారలుగా వెలుగొందిన ఇద్దరు శాస్త్రవేత్తలు మంగళవారం అస్తమించారు. ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ (86) పుణెలో, ప్రసిద్ధ అణుశాస్త్రవేత్త ఎం.ఆర్.శ్రీనివాసన్ (95) ఊటీలో కన్నుమూశారు. ఖగోళ భౌతిక శాస్త్రానికి విశేష సేవలందించిన డాక్టర్ జయంత్ నార్లికర్ మంగళవారం పుణెలో తెల్లవారుజామున నిద్రలోనే ప్రాణాలు విడిచారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. 1938, జులై 19న జన్మించిన డాక్టర్ జయంత్ నార్లికర్ తన తండ్రి విష్ణు వాసుదేవ నార్లికర్ పనిచేసిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ)లో చదువుకున్నారు. తదనంతరం ఆయన పైచదువుల కోసం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లారు. తనకు డాక్టోరల్ సలహాదారుగా వున్న ఫ్రెడ్ హాయ్ల్‌తో కలిసి ఆయన హాయ్ల్-నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం 1972 నుంచి 1989 వరకూ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ సంస్థలో పనిచేశారు. 1988లో యూజీసీ అంతర్ విశ్వవిద్యాలయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ కేంద్రం (ఐయూసీఏఏ) ఏర్పాటు చేయాల్సిందిగా ఆయనను ఆహ్వానించింది. ఆ కేంద్రానికి ఆయన వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఉన్నారు. 2003లో రిటైర్ అయ్యేంత వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. తదనంతరం ఆయన ఐయూసీఏఏకు గౌరవ ప్రొఫెసర్‌గా కొనసాగారు. 1965లో కేంద్ర ప్రభుత్వం ఆయనను 26 ఏళ్ల పిన్నవయసులో పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. 2004లో ఆయన పద్మవిభూషణ్ అవార్డును, 2011లో


ఎం.ఆర్.శ్రీనివాసన్


నార్లికర్

మహారాష్ట్ర భూషణ్ అవార్డును అందుకున్నారు. మరాఠీలో రాసిన ఆయన ఆత్మకథకు 2014లో సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.

**అణువిద్యుత్ రంగంలో సాటిలేని శ్రీనివాసన్**

అణు శాస్త్రవేత్తగా, అణువిద్యుత్ కమిషన్ ఛైర్మన్‌గా దేశానికి విశేష సేలందించిన డాక్టర్ ఎం.ఆర్. శ్రీనివాసన్ తమిళనాడులోని ఉదగమండలం(ఊటీ)లో మంగళవారం మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 1930లో బెంగళూరులో జన్మించిన శ్రీనివాసన్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ చేసి, అనంతరం కెనడాలోని మెక్‌గిల్ వర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టర్ శ్రీనివాసన్ 1955లో అణు విద్యుత్ శాఖలో చేరారు. దేశ అణు విద్యుత్ రంగానికి ఆద్యుడైన డాక్టర్ హొమీ జహంగీర్ భాభాతో కలిసి పనిచేశారు. దేశ తొలి అణు పరిశోధక రియాక్టర్ "అప్సర" నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. 1959లో ఆయన దేశ తొలి అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ ఇంజినీరుగా నియమితులయ్యారు. 1967లో ఆయన మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్‌కు చీఫ్ ప్రాజెక్టు ఇంజినీరుగా పనిచేశారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఆయన వ్యవస్థాపక ఛైర్మన్‌గా ఉన్నారు. అణు రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను 2015లో పద్మవిభూషణ్ అవార్డుతో సత్కరించింది. పదవీ విరమణ తర్వాత ఊటీలో ఉంటున్న ఆయన అక్కడే కన్నుమూశారు. డాక్టర్ జయంత్ నార్లికర్, డాక్టర్ ఎం.ఆర్. శ్రీనివాసన్‌ల మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు.

## ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు ప్రమోషన్




భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ పాకిస్థాన్‌లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిం మునీర్‌కు ఆ దేశ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. దేశంలోనే అత్యున్నత సైనిక హోదా అయిన 'ఫీల్డ్ మార్షల్' గౌరవాన్ని ఆయనకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో జనరల్ ఆసిం మునీర్‌ను 'ఫీల్డ్ మార్షల్'గా నియమించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ పదోన్నతి ద్వారా ఆసిం మునీర్ పాకిస్థాన్ సైనిక చరిత్రలో అత్యున్నత హోదాను అలంకరించిన కొద్దిమంది అధికారుల జాబితాలో స్థానం సంపాదించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో, పాకిస్థాన్ తన సైన్యాధిపతికి ఇలాంటి ఉన్నతస్థాయి పదోన్నతి కల్పించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, అంతర్గత భద్రతా సవాళ్ల నేపథ్యంలో సైన్యం పాత్ర కీలకంగా మారిన సమయంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

## ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండ చరియలు..

# చిక్కుకుపోయిన వందలాది యాత్రికులు

**ఇంటర్నెట్‌డెస్క్:** ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్-మానసరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితో పాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయకచర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు ఐదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్- మానస సరోవర్ యాత్రను ఈ ఏడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. '50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి, 10 బృందాలు సిక్కిం నాథులా పాస్ నుంచి ఈ యాత్రకు తరలి వెళ్తాయి' అని వెల్లడించింది. యాత్ర కోసం దరఖాస్తులను %ఎఎ.న్రశీజ.ఐఅ%లో సమర్పించవచ్చని, కంప్యూటర్ జనరేటెడ్ విధానం ఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది.



కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. ఆ తర్వాత గల్వాన్ ఘర్షణల కారణంగా భారత్, చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. గతేడాది రష్యాలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెటచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే కైలాస్- మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు. సాక్షాత్తూ పరమశివుడు నివాసముంటాడని విశ్వసించే చోటు కైలాస పర్వతం బ్రహ్మ ముహూర్తంలో దేవతలు స్నానమాచరించే ప్రాంతంగా విశ్వసించే మానస సరోవరం సరస్సు అక్కడికి చేరువలోనే ఉంటుంది. టిబెట్‌లోని ఈ రెండు సుమనోహర పుణ్యక్షేత్రాలు హిందువులతో పాటు జైనులు, బౌద్ధులకూ అత్యంత పవిత్రమైనవి. ఏటా ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కైలాస-మానస సరోవర యాత్రలో పాల్గొంటారు.

# విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలి

వక్ఫ్ చట్టం 1995లోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయదలచుకుంటే, వాటిని కేవలం మూడు కీలక అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గతంలో ఈ కేసును విచారించిన ధర్మాసనం గుర్తించిన మూడు అంశాలకే ప్రస్తుత విచారణను కూడా పరిమితం చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మూడు అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తమ సమాధానాలను, అఫిడవిట్‌ను దాఖలు చేసిందని ఆయన గుర్తుచేశారు. అయితే, పిటిషనర్లు తాజాగా దాఖలు చేసిన లిఖితపూర్వక సమర్పణల్లో మరిన్ని కొత్త అంశాలను లేవనెత్తుతున్నారని, ప్రస్తుతానికి విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలని ఆయన అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ వాదనలను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు.



సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ... సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని అంగీకరించలేదు. విచారణ పరిధిని కుదించవద్దని వారు కోరారు. గతంలో ఏప్రిల్ 17న జరిగిన విచారణ సందర్భంగా బై-యూజర్ సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అదేవిధంగా, వక్ఫ్ బోర్డులలో ఎటువంటి కొత్త నియామకాలు చేపట్టబోమని కూడా అప్పట్లో కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించిన మూడు అంశాల్లో మొదటిది, వక్ఫ్ బై యూజర్ లేదా వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారానికి సంబంధించినది. ఇక రెండో అంశం, రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లిం వర్గాలు వ్యతిరేకించడం. మూడోది, వక్ఫ్ ఆస్తుల సర్వే బాధ్యతను సర్వే కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్‌కు బదిలీ చేసే నిబంధనపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు.

## మళ్లీ కోవిడ్ కలవరం

ముంబై

ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ కలవర పెడుతోంది. మంగళవారంనాటికి దేశంలో 257 కోవిడ్ కేసులు నమోదవ్వగా ముంబైలోనే 53 కేసులు నమోదయ్యాయి. వారం రోజుల్లోనే 164 కేసులు పెరిగాయి. క్రియాశీలక కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే మరణాలేవీ సంభవించలేదు. ముంబైలో కేసులు పెరుగుతుండటంతో నగరంలోని ఆస్పత్రులు కోవిడ్ రోగుల చికిత్సకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రజల్లో ఆందోళన పెరుగుతుండటంతో, భయపడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ప్రజల్లో రోగ నిరోధక శక్తి బలపడిందని, కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం తీసుకోవాలని తెలిపారు. పరిస్థితి సాధారణంగానే ఉందని, అయిన ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. రోగుల సంఖ్య పెరిగినా మునుపటిలా భయపడాల్సిన అవసరం లేదని, ఈ ఇన్‌ఫెక్షన్‌తో అంత ప్రమాదం లేదని రాష్ట్ర ఆరోగ్య మంత్రి ప్రకాశ్ అబిత్కర్ చెప్పారు. కేంద్రం సూచనలు జారీ చేస్తే తప్ప కరోనాకు సంబంధించి ముందు జాగ్రత్తలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు.

## మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు!

న్యూఢిల్లీ

రైతాంగానికి శుభవార్త. నైరుతి రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో కేరళకు చేరుకొనే అవకాశం ఉందని భారత వాతవరణ విభాగం(ఐఎండీ) ప్రకటించింది. పరిస్థితులు అందుకు పూర్తి అనుకూలంగా ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. ఈ నెల 27వ తేదీ నాటికి రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండీ గతంలో ప్రకటించింది. కానీ, అంతకంటే రెండు రోజుల ముందే రానున్నాయని మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి తాజాగా అంచనా వేసింది. అదే జరిగితే 2009 తర్వాత నైరుతి రుతుపవనాలు త్వరగా రావడం ఇదే మొదటిసారి అవుతుంది. 2009లో మే 23న కేరళలో అడుగుపెట్టాయి. సాధారణంగా ఈ రుతుపవనాలు ప్రతిఏటా జూన్ 1వ తేదీ కల్లా కేరళలో ప్రవేశిస్తాయి. జూన్ 8 నాటికి దేశమంతటా వ్యాపిస్తాయి. సెప్టెంబర్ 17 నుంచి రుతుపవనాల ప్రభావం తగ్గడం మొదలవుతుంది. అక్టోబర్ 15 కల్లా పూర్తిగా తగ్గిపోతుంది. అయితే, ఈసారి దాదాపు ఐదు రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు వస్తుండడంవిశేషం. 2018లో మే 29, 2019లో జూన్ 8, 2020లో జూన్ 1, 2021లో జూన్ 3, 2022లో మే 29, 2023లో జూన్ 8, 2024లో మే 30న రుతుపవనాలు కేరళలో అడుగుపెట్టాయి.

ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ ఇప్పటికే వెల్లడించింది. ఎల్%-%నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు లేవని తెలియజేసింది. భారత్‌లో వ్యవసాయ రంగానికి నైరుతి రుతుపవనాలు అత్యంత కీలకం. దేశవ్యాప్తంగా జలాశయాలు నిండడానికి, విద్యుత్ ఉత్పత్తికి ఇవి దోహదపడుతుంటాయి. దేశంలో 42.3 శాతం జనాభాకు వ్యవసాయ రంగమే ఆధారం. దేశ
జీడీపీలో ఈ రంగం వాటా 18.2%
నైరుతి రుతుపవనాల రాక కంటే ముందు దేశంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా ఉత్తరాదిన ఈ పరిణామం కనిపిస్తోంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి మరో రెండు రోజుల్లో తుపానుగా మారనుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనవల్ల నైరుతి రుతుపవనాలు కేరళ దిశగా వేగంగా ముందుకు కదులుతాయని అంటున్నారు. ఉత్తర కేరళలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. వయనాడ్, కాసరగోడ్, కన్నూర్, కోజికోడ్ జిల్లాల్లో రెడ్ అలర్ట్, పాలక్కాడ్, మలప్పురం, త్రిసూర్ జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

## పాకిస్తాన్‌లో ఘంటసాలసాంగ్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ లో ఓ ప్రాచీన ఆలయంలో మన ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన పాట వినిపించడం తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అవుతోంది. గూఢచర్యం ఆరోపణలతో అరెస్టైన భారతీయ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా గతంలో షూట్ చేసిన ఓ వీడియో ద్వారా ఈ ఆసక్తికర దృశ్యం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో యూ ట్యూబ్ లో చక్కర్లు కొడుతోంది. సంబరంగా షేర్ చేసుకుని మరీ చూస్తున్నారు సంగీత ప్రియులు. హర్యానాలోని హిసర్ కి చెందిన 33 ఏళ్ళ జ్యోతి మల్హోత్రాకి సోషల్ మీడి యాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెల్ విత్ జ్యో పేరుతో వీడియోస్ చేస్తుంటుంది. ట్రావెల్ విత్ జ్యో పేరుతో యూట్యూబ్ చానెల్ ఉంది. పహల్గాం దాడి జరగడానికి రెండు నెలల ముందు ఆమె కటాస్ రాజ్ గుడిలో ఓ వీడియో షూట్ చేసింది. అక్కడ శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలున్నాయి. జ్యోతి ఆంజనేయుడి ఆలయంలోకి వెళ్లగానే అక్కడ తెలుగు పాట వినిపించంది. ప్రఖ్యాత గాయకుడు ఘంటసాల పాడిన భూకైలాస్ శినమాలో రాముని అవతారం పాట అది. రాముని అవతారం రఘుకుల సోముని అవతారం అంటూ ఆంజనేయుడి ఆలయంలో కూర్చుని ఓవ్యక్తి పాడుతున్న వీడియోని షూట్ చేసింది జ్యోతి. 50 నిముషాల 52 సెకెన్లు ఉన్న ఈ ట్రావెల్ వీడియోలో 6 నిముషాల 50 సెకెన్ల దగ్గర తెలుగు పాట మీరు వినొచ్చు. పాకిస్థాన్ కోసం గూఢచారిగా మారిందన్న ఆరోపణలతో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్ట్ చేశారు. ఢిల్లీలో పాక్ హై కమిషన్‌కు చెందిన డానిష్ అనే ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో ఆమె పాకిస్తాన్ కోసం గూఢచారిగా పని చేయటం ప్రారంభించిందనే ఆరోపణలున్నాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాట కులపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనకు రెండు నెలల ముందు జ్యోతి పహల్గాం వెళ్లి వీడియోస్ తీసినట్టు సమాచారం. ఆ సమాచారాన్ని పాకిస్థాన్ ఏజెంట్లకు చేరవేసిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దాడి జరగడానికి జ్యోతి పంపిన వీడియో కూడా కారణం కావొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఆపరేషన్ సిందూర్ తర్వాత నెలకొన్ని ఉద్రిక్తతక సమయంలోనూ ఆమె ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో అధికారి డానిష్ తో టచ్ లో ఉన్నట్టు నిర్ధారణ అయింది. కేవలం పాకిస్థాన్ లో మాత్రమే కాదు.. జ్యోతి పలుమార్లు పాకిస్థాన్ లో పర్యటించింది, ఓసారి చైనా కూడా వెళ్లొచ్చినట్టు పోలీసులు వెల్లడించారు.దేశానికి సంబంధించిన సున్నితమైన విషయాలు పాకిస్తాన్‌కు చేరవేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియా అకౌంట్స్ పై నెటిజన్లకు ఫోకస్ పెరిగింది. ఇందులో బాగంగా వీడియోస్ లో ఈ తెలుగు పాట వెలుగుచూసింది. పరాయిదేశంలో అందులోనూ పాకిస్థాన్ లో ఆలయంలో ఘంటసాల పాట వినిపించడం తెలుగువారిని ఆనందంలో ముంచెత్తుతోంది.

## 7 నెలలు.. 25 పెళ్లిళ్లు...

## భోపాల్‌లో పెళ్లి ముఠా

**జైపూర్ :** ఓ మహిళ కేవలం 7 నెలల్లోనే ఏకంగా 25 మందిని పెళ్లి చేసుకుంది. వామ్మో అంత మందిని ఎందుకు చేసుకుంది అని మీకు డౌట్ రావొచ్చు. ఆ పెళ్లిళ్ల వెనుక పెద్ద స్కామ్ ఉంది. అదేంటో తెలిస్తే.. పెళ్లి కానివారికి పెళ్లి సంబంధం వచ్చిందంటేనే గుండెలు జారిపోతాయ్. వయసు పైబడుతున్నా ఇంకా పెళ్లి కాని యువకులను టార్గెట్ చేసి, పెళ్లి చేసుకుని విలువైన వస్తువులతో ఉడాయిస్తున్న మహిళను రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు.భోపాల్‌లో సవాయ్ మాధోపూర్ పోలీసులు ఆ మహిళను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ మహిళ కేవలం 7 నెలల వ్యవధిలోనే 25 మంది యువకులను పెళ్లి చేసుకొని మోసం చేసినట్లు బయటపడింది. అయితే ఈ స్కామ్‌లో ఆ మహిళ ఒక్కతే కాదు.. ఆమె వెనుక పెద్ద గ్యాంగే ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌కు చెందిన అనురాధ పాశ్వాన్ (23) గతంలో ఓ ఆసుపత్రిలో పనిచేసింది. భర్తతో గొడవల కారణంగా విడాకులు తీసుకున్న అనురాధ.. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌కు మకాం మార్చింది. భోపాల్‌లో నివసిస్తూ ఓ పెళ్లిళ్ల ముఠాతో చేతులు కలిపింది. పెళ్లి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న యువకులను ఈ ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకునేవారు. ఒక మంచి పెళ్లి సంబంధం ఉందని చెప్పి అనురాధ ఫొటో చూపించేవారు. ఆ తర్వాత చట్టబద్ధంగా వివాహం జరిపించి, పెళ్లి చేసినందుకు భారీగా కమిషన్ తీసుకునేవారు.అనురాధ కొద్దిరోజులు అత్తారింట్లో ఉండి, వీలు చిక్కగానే బంగారం, నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులతో రాత్రికి రాత్రే ఉడాయించేది. ఇలా వివిధ రాష్ట్రాల్లో 7 నెలల్లో 25 మందిని మోసం చేసింది. సవాయ్ మాధోపూర్‌కు చెందిన విష్ణు శర్మ అనే వ్యక్తి మే 3న ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

# ‘డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రం’పై చట్టపరమైన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

వ్యవహరించిన ‘డీడీ నెక్స్ట్ లెవల్’ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ వివరాలను బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

### పచ్చదనం పెంపునకు పెద్దపీట

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో పచ్చదనాన్ని మరింతగా పెంచాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 68.14 శాతంగా ఉన్న పచ్చదనాన్ని అటవీశాఖ సహకారంతో 80 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత దశలవారీగా నిధులు విడుదల చేయనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.74 కోట్లు, 2026-27లో రూ.1.13 కోట్లు, 2027-28లో రూ.1.13 కోట్లను అటవీశాఖకు అందజేయాలని నిర్ణయించింది.

### ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందించాలని బోర్డు తీర్మానించింది. ఇందుకోసం ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించనుంది.

### విశ్రాంతి భవనాల పేర్ల మార్పు, క్యాంటీన్ల లైసెన్స్ ఫీజు

తిరుమలలోని విశ్రాంతి భవనాల పేర్ల మార్పు విషయంలో స్పందించని ఇద్దరు దాతలకు చెందిన గృహాల పేర్లను టీటీడీయే మార్చాలని నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశానికి ఆమోదం తెలిపారు. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరున్న సంస్థలకు ఈ క్యాంటీన్లను



అప్పగించాలని నిర్ణయించారు.

### స్విమ్స్‌కు అదనపు చేయూత

రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయాన్ని పెంచుతూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏటా అందిస్తున్న రూ.60 కోట్లకు అదనంగా మరో రూ.71 కోట్లు ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. స్విమ్స్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకం చేపట్టాలని, 85 శాతం నిర్మాణాలు పూర్తయిన ఆంకాలజీ, పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి భవనాల మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. శ్రీవారి వైద్య సేవలను కూడా విస్తృతం చేయాలని తీర్మానించారు.

### ఇతర కీలక నిర్ణయాలు

ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను సందర్శించే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింతగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్థులను బదిలీ చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని, అవసరమైతే స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకోవాలని ఆమోదించారు. తిరుమల ఆలయ భద్రత దృష్ట్యా యాంటీ డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించి, తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింతగా పెంచాలని తీర్మానించారు. తుళ్లూరు మండలం అనంతవరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

# మనకూ టైం వస్తుంది.. వాళ్లకు సినిమా చూపిస్తాం

-మొదటిపేజీ తరువాయి

అడిగాడు. కాని, మన పార్టీ ఎమ్మెల్యేను మనం హౌస్ అరెస్ట్ చేయించాం. ప్రజాస్వామ్యంగా అక్కడ ఎన్నిక జరిగేలా చూశాం, కాబట్టే అక్కడ టీడీపీ గెలిచింది. రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలు చూడకుండా, చివరకు టీడీపీ వాళ్ల సమస్యలనూ తీర్చాం. ..జగనన్నకు చెబుదాం నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు వెంటనే స్పందించి పరిష్కారం చూపాం. స్పందన కార్యక్రమం ద్వారా కూడా వివక్ష లేకుండా పరిష్కారాలు చూపాం. అత్యధికంగా టీడీపీ వాళ్లకు చెందిన సమస్యలకు పరిష్కారాలు చూపి మంచి పరిపాలన అందించాం. ఇవాళ చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీచేస్తున్నాడు” అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే.. ఆయన మాటల్లోనే..

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

తిరువూరులో సంఖ్యాబలం లేని చోటకూడా టీడీపీ పోటీకి పెట్టి, లాగేసుకునే ప్రయత్నంచేస్తోంది

అయినా సరే మెజార్టీ వైయస్సార్‌సీపీ ఉండడంతే ఎన్నికను ఆపుతున్నారు: పోలీసులు వైయస్సార్‌సీపీ వాళ్లని అరెస్టు చేస్తున్నారు, టీడీపీ వాళ్లని రోడ్డుపై విడిచిపెడుతున్నారు సంఖ్యాబలం లేకపోయినా నర్సారావుపేట, కారంపూడిల్లో గెలిచామని ప్రకటించుకున్నారు కుప్పం మొదలుకుని ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితే రాప్తాడులో రామగిరి ఉప ఎన్నికలో అరాచకాలకు అంతులేదు ప్రజాస్వామ్యంలో ఒక పార్టీ గుర్తుమీద, ఒక పార్టీ బి-ఫాం మీద గెలిచినప్పుడు, సంఖ్యాబలంలేకపోయినా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవాళ్లు అక్రమాలను ప్రోత్సహించడం ఎంతవరకూ సమంజసం పోలీసులను పెట్టి బెదిరిస్తున్నారు యలమంచిలిలో మన వాళు గట్టిగా నిలబడి గెలుపును సాధించుకున్నారు ఏ ప్రభుత్వంపైన అయినా వ్యతిరేక రావాలంటే సమయం పడుతుంది కాని చంద్రబాబుగారి పరిపాలనలో నెలల్లోనే విపరీతమైన వ్యతిరేకత వచ్చింది మనకన్నా ఎక్కువ చేస్తానని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చాడు జగన్ ఇచ్చేవన్నీ ఇస్తాను, అంతకంటే ఎక్కువ ఇస్తానన్నాడు కాని వాటన్నింటినీ తుంగలో తొక్కాడు కాని, మన ప్రభుత్వంలో ప్రతి కార్యకర్త మనం అమలు చేసిన మేనిఫెస్టోతో ప్రతి ఇంటికీ వెళ్లాడు గడపగడపకూ కార్యక్రమం కింద మూడుసార్లు ప్రతి ఇంటికీ వెళ్లారు: 99శాతం హామీలను అమలు చేసిన పార్టీ భారతదేశ చరిత్రలో వైయస్సార్‌సీపీ మాత్రమే

### మనం చేసిన మంచి ఎక్కడకూ పోదు

10 శాతం ప్రజలు చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మారు

ఇప్పుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు ఫుట్‌బాల్ తన్నినట్టు ఈ ప్రభుత్వాన్ని తంతారు వైఎస్సార్‌సీపీ మాదిరిగా ప్రతి ఇంటికీ వెళ్లే ధైర్యం టీడీపీకి ఉందా? హామీల అమలుపై గట్టిగా నిలదీస్తారనే భయం వారికి ఉంది మాట ఇవ్వడం అంటే వెన్నుపోటు మాత్రమే అని చంద్రబాబుగారు నిరూపించారు పేదవాడి వైద్యం గురించి ఆలోచించే పరిస్థితి లేదు ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేశారు రూ.3600 కోట్లు



పెండింగ్‌లో పెట్టారు ఆరోగ్య ఆసరాను పూర్తిగా ఎత్తివేశారు వైద్యంకోసం అప్పులు పాలు అయ్యే పరిస్థితి ఏ పంటకూ కనీస మద్దతు ధర రావడంలేదు ప్రభుత్వం రంగంలో వైయస్సార్‌సీపీ తీసుకొచ్చిన కాలేజీలను చంద్రబాబు అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నాడు:

### మనకూ టైం వస్తుంది.. వాళ్లకు సినిమా చూపిస్తాం

కొత్తగా మూడు పోర్టులు నిర్మాణం ప్రారంభించాం శ్రీకాకుళంలో మూలపేట పోర్టు నిర్మాణాన్ని జోరుగా ముందుకు తీసుకెళ్లాం ఇప్పుడు ఆమూడు పోర్టులను కమీషన్లకోసం అమ్మేసేందుకు చంద్రబాబు శ్రీకారం చుట్టాడు ట్రైబల్ ప్రాంతాన్ని అభివృద్ధి పథాన నడిపించాం ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీలు, ట్రైబల్ యూనివర్శిటీ, మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రులు పెట్టాం బోగాపురం ఎయిర్‌పోర్టుకు గత చంద్రబాబు హయాంలో అనుమతులు లేవు, భూసేకరణ లేదు మనం అన్నీచేసి 30శాతం పనులు చేశాం రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా అభివృద్ధి పనులు కేవలం వైయస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయి ఈరోజు ఇవన్నీ నాశనం అయిపోతున్నాయి వ్యవస్థలను చంద్రబాబు నాశనం చేస్తున్నాడు ప్రజలను వెన్నుపోటు పొడిచాడు ఎవరూ ప్రశ్నించకూడదని భయానక పరిస్థితులను తీసుకు వచ్చాడు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు ఎవరైనా గొంతు విప్పితే వారిని అణచివేయాలని చూస్తున్నాడు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తప్పుడు కేసులు పెడుతున్నారు తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాలు సృష్టిస్తున్నారు గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు పార్టీలో చురుగ్గా ఉన్న వ్యక్తులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు ప్రతి కార్యకర్త కష్టాన్నీ చూస్తున్నాను జగన్ 2.0లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుంది కోవిడ్ కారణంగా ఐదేళ్లపాలనలో అనుకున్నంతమేర సరిగ్గా చేయలేకపోయాం ఇవాళ మీ కష్టాలను చూస్తున్నాను రేపు కచ్చితంగా వై?ఎస్సార్‌సీపీకి కార్యకర్తే నంబర్ ఒన్ అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి కొడతానంటే.. కొట్టమనండి కాని, మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి కాని, ఆ అన్యాయాలు చేసిన వారికి సినిమాలు చూపిస్తాం రిటైర్డ్ అయిన వారినీ లాక్కుని వస్తాం దేశం విడిచిపెట్టి వెళ్లినా సరే రప్పిస్తాం అన్యాయాలు చేసిన ఒక్కొక్కరికి సినిమాలు చూపిస్తాం మనకూ టైం వస్తుంది చంద్రబాబు నాటిని విత్తనాలు.. కచ్చితంగా ఈ పరిస్థితులకు దారితీస్తాయి చంద్రబాబు దుర్మార్గపు పాలనవల్ల తీవ్రంగా ఇబ్బంది పడ్డవారి కథలు వింటే చాలా ఆవేదన కలుగుతోంది మహిళలను అని చూడకుండా నెలలతరబడి జైళ్లలో పెడుతున్నారు ఒక కేసులో బెయిల్ వస్తుంది, అది రాగానే మరో కేసు పెడుతున్నారు ఇలా కేసులు మీదు కేసులు పెడుతన్నారు వల్లభనేని వంశీ విషయంలో ఇలాగే చేశారు దళితుడైన ఎంపీ నందిగం సురేష్ విషయంలోనే ఇలాగే దారుణాలు చేస్తున్నారు సుమారు నెలన్నరకుపైగా జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత ఇప్పుడు మళ్లీ కేసుపెట్టి జైల్లో వేశారు తనను, తన కుటుంబ సభ్యులను తిడితే, ఎందుకు తిట్టావన్నందుకు తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారు చంద్రబాబు ఇవాళ నాటిన విత్తనం రేపు మహావృక్షం అవుతుందని మరిచిపోవద్దు రాబోయే రోజుల్లో ప్రజల తరఫున గట్టిగా పోరాటాలు చేద్దాం వచ్చేది మన ప్రభుత్వమే మంచి రోజులు కచ్చితంగా వస్తాయి

## రేషన్ స్థానంలో నగదు బదిలీ

-మొదటిపేజీ తరువాయి

రేషన్ తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. రేషన్ స్థానంలో నగదు బదిలీ ప్రవేశ పెడితే ఎలా ఉంటుందనే దానిపై చర్చించారు. పొగాకు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెంపుల్ టూరిజంలో భాగంగా శ్రీశైలం అభివృద్ధిపై మంత్రులతో సమాలోచనలు జరిపారు.

### కేబినెట్ నిర్ణయాలు ఇవే..

సౌర విద్యుత్, పవన విద్యుత్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం. త్వరలోనే విద్యుత్ ఇంధన వనరుల కేంద్రంగా మారనున్న అనంతపురం

వివిధ పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం.. టూరిజం పాలసీకి అనుగుణంగానే వీరికి ప్రోత్సాహకాలు

డైకిన్ ఏసీ తయారీ సంస్థకు శ్రీసిటీలో విస్తరణకు అనుమతి

ప్రాజెక్టు వయబిలిటి దృష్టిలో ఉంచుకొని తిరిగి 500 ఎకరాలు కేటాయింపు

అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం. 20 శాతం సీట్లు ఏపీ విద్యార్థులకు కేటాయించేలా రిజర్వేషన్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏలూరు వద్ద ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామకం కోసం చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం ఏపీ రిజిస్ట్రేషన్ చట్టం 22ఏ నిషేధ జాబితాలోని ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దుతో పాటు ఫీజు మినహాయింపునకు కేబినెట్ ఆమోదం కడప జిల్లాలో అదానీ గ్రీన్ ఎనర్జీ కి 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ సత్యసాయి జిల్లాలో అదానీ గ్రీన్ ఎనర్జీ 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు భూ కేటాయింపు చేసేందుకు ఆమోదం నెల్లూరు జిల్లా ముత్తుకూరులో 615 ఎకరాల భూమి పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయించేందుకు అంగీకారం రాజకీయ కక్షతో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్ నుంచి కొన్ని మండలాలు అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు కేబినెట్ ఆమోదం

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రాజక్టు కోసం ఐబీఎం, టీసీఎస్‌లతో ఏపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలకు కేబినెట్ ఆమోదం

రవాణా వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గించేందుకు ఏపీ మోటారు వాహనాల చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం

## ఏపీలో విద్యాసంస్కరణలపై దేశ వ్యాప్తంగా చర్చ

-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం పట్టుదలతో ముందుకు సాగుతామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తల్లిదండ్రులు తలెత్తుకొని తిరిగేలా చేశారని సంతోషం వ్యక్తం చేశారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్య సాధన కోసం కసి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్నట్టు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

## వంద రోజులుగా జైల్లోనే వంశీమోహన్ రాజకీయాలకు గుడ్ బై

**విజయవాడ :** మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఇప్పట్లో జైలు నుంచి బయటపడే అవకాశం కనిపించడం లేదు. ఆయనపై వరుస పెట్టి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఒక కేసులో బెయిల్ లభిస్తే.. మరో కేసు నమోదు చేస్తున్నారు. దీంతో వల్లభనేని వంశీ మోహన్ రిమాండ్ ఖైదీగానే ఉండిపోవాల్సి వస్తోంది. మరోవైపు ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. శ్వాస తీసుకోవడానికి కూడా ఆయన ఇబ్బంది పడుతున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వల్లభనేని వంశీ మోహన్ పరిస్థితిని తలచుకొని ఆయన అభిమానులు బాధపడుతున్నారు. అదే సమయంలో వల్లభనేని వంశీ మోహన్ రాజకీయంగా తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిణామాలను తలచుకొని ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాజకీయాల విషయంలో కీలక నిర్ణయానికి వచ్చారు. బెయిల్ లభించిన వెంటనే ఆయన ఓ ప్రకటన చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ కామెంట్స్ పై పశ్చాత్తాపం.. గన్నవరం నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు టిడిపి అభ్యర్థిగా గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. 2014లో తొలిసారిగా గన్నవరం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి ఆయనకే ఛాన్స్ ఇచ్చారు చంద్రబాబు. జగన్ ప్రభంజనంలో సైతం వల్లభనేని వంశీ మోహన్ టిడిపి అభ్యర్థిగా గెలిచారు. అయితే గెలిచిన కొద్ది రోజులకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఆ వ్యాఖ్యల వెనుక జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహం ఉందన్నది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు దానికి మూల్యం చెల్లించుకుంటున్నారు వల్లభనేని వంశీ మోహన్. సుమారుగా 100 రోజులపాటు జైల్లో ఉండి అనారోగ్యానికి గురయ్యారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో న్యాయ సాయం అందడం లేదని ఆవేదనతో ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం తన వ్యక్తిగతంగా దెబ్బతిన్నానని.. నాడు తాను ఆ వ్యాఖ్యలు చేసి ఉండకూడదని ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నట్లు తెలుస్తోంది.గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి, అక్కడ పనిచేస్తున్న సత్య వర్ధన్ అనే వ్యక్తి కిడ్నాప్ వంటి కేసులు నమోదు చేశారు ఏపీ పోలీసులు. ఫిబ్రవరి 13న హైదరాబాదులో వల్లభనేని వంశీ మోహన్ ను అరెస్టు చేశారు. అప్పటినుంచి కేసు మీద కేసులు పెడుతూనే ఉన్నారు. మొత్తం ఆరు కేసులు పెట్టారు. అందులో ఐదు కేసుల్లో బెయిల్ లభించింది. అయితే ఇంతలో నకిలీ ఇళ్లపట్టాలకు సంబంధించి కేసు నమోదు చేశారు. దీంతో ఆయన రిమాండ్ మరో రెండు వారాలపాటు పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. అయితే వల్లభనేని వంశీ మోహన్ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో సాయం అందడం లేదు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు తెలుస్తోంది. లాయర్లతో వంశీ మోహన్ భార్య స్వయంగా మాట్లాడుతూ సమన్వయం చేసుకుంటున్నారు. పార్టీ కోసం ఇంత చేస్తే.. అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టించుకోకపోవడంపై వల్లభనేని వంశీ మోహన్ ఆవేదనతో ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు గన్నవరం విషయంలో జగన్మోహన్ రెడ్డి ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలను దుట్టా రామచంద్ర రావు కుమార్తెకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ నిర్ణయంతో వల్లభనేని వంశీ మోహన్ లో మరింత మనస్థాపం పెరిగినట్లు సమాచారం. తనకు మాట మాత్రం చెప్పకుండా నియోజకవర్గ బాధ్యతలు వేరొకరికి ఎలా అప్పగిస్తారని లోలోపల బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే బెయిల్ పై విడుదలైన వెంటనే ఒక ప్రకటన జారీ చేయాలని వంశీ నిర్ణయించుకున్నట్లు సమాచారం. రెండుసార్లు తెలుగుదేశం పార్టీ గుర్తుపై గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తన ప్రభావాన్ని కోల్పోయారు. తన ఈ పరిస్థితికి జగన్మోహన్ రెడ్డి తీరు కారణమని వల్లభనేని వంశీ మోహన్ ఆరోపించే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికైతే వల్లభనేని వంశీ మోహన్ లో రియలైజేషన్ కనిపిస్తోంది. తీవ్ర నిర్ణయం దిశగా ఆయన ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# మహానాడుకు జూనీయర్...

**కడప :** తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడుకు సమయం ఆసన్నం అవుతోంది. ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడు కడపలో జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించారు. ప్రధానంగా కమిటీలు ఏర్పాటు చేశారు. భారీ విజయంతో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇది. అందుకే ఘనంగా నిర్వహించాలని ప్లాన్ చేశారు. అయితే ఈసారి చేసే రాజకీయ తీర్మానాలు కీలకంగా మారనున్నాయి. మరో నాలుగు దశాబ్దాల పాటు పార్టీ మనుగడ సాధించేలా కీలక నిర్ణయాలు తీసుకొనున్నారు. ముఖ్యంగా నందమూరి కుటుంబ సభ్యులను మహానాడులో భాగస్వామ్యం చేయనున్నారు. ఈసారి మహానాడుకు జూనియర్ ఎన్టీఆర్ ను పిలవాలని నిర్ణయం పార్టీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.తెలుగుదేశం పార్టీకి మహానాడు పండుగ లాంటిది. ఆ పార్టీ ఆవిర్భావము నుంచి నందమూరి తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా మహానాడు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్టీఆర్ మరణానంతరం కూడా ఆయన జయంతి నాడు మహానాడు ను నిర్వహిస్తూ వచ్చారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కడప జిల్లాలో మహానాడు ను నిర్వహించాలని నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లాలో మహానాడు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూడా మహానాడు నిర్వహించాలని టిడిపి హై కమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కడపలో మహానాడు కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్య నేతలు హాజరు కానున్నారు.మరోవైపు నందమూరి హీరోలను భాగస్వాములను చేయాలని టిడిపి హై కమాండ్ భావిస్తోంది. అందులో భాగంగా చాలా కాలంగా పార్టీ వ్యవహారాలకు, కుటుంబ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జూనియర్ ఎన్టీఆర్ ను మహానాడుకు ఆహ్వానించాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు సంబంధించి నందమూరి బాలయ్య చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 2009 ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం చేశారు.

## సంపాదకీయం

# మానవాళికి ఉపద్రవంగా ఉగ్రవాదం

ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. అకారణ చట్టవ్యతిరేక హింసాత్మక, ప్రమాదకర, విధ్వంసక ఘటనలకు పాల్పడి ప్రజల్లో భయాందోళనలా కల్పించాన్ని ఉగ్రవాదం అని పిలుస్తాం. అగ్రరాజ్యం అమెరికా నుంచి నిరుపేద దేశాల వరకు అంతటా ఉగ్రవాద దుశ్చర్యలు జరుగుతూనే ఉన్నాయి. మానవీయతను మట్టుపెట్టడమే పాశవిక ఉగ్రవాదుల లక్ష్యం. ప్రపంచంలో అశాంతి రేపడమే వారి అభిమతం. రక్తపాతం అమానవీయమని, ఉగ్రవాదం పాశవిక చర్య అని, తీవ్రవాద ఆలోచనలు పశుత్వానికి నిదర్శనమని తెలుసుకోవాలి. ఉగ్రవాదమే కనిపించని ప్రపంచంలో స్వేచ్ఛగా శాంతి పావురాలు ఎగిరే రోజులు రావాలని ఆశిద్దాం. ఒకరిని అకారణంగా చంపడం పశుత్వం. మానవుడే మరో మానవుడి ప్రాణాలు తీయడం నీఛమైన చర్య. ఉగ్రవాదం అంటేనే విధ్వంసం, వినాశనం అని ఉగ్ర మూరు?లు తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదుల దాడుల కారణంగా 2023లో 21, 596 మంది, 2022లో 21,957 మంది, 2021లో 23,712 మంది, 2020లో 29,326 మంది, 2019లో 26,273 మంది, 2018లో 32,864 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం. ఉగ్రవాదం ప్రపంచవ్యాప్తం అయ్యిందని గత హింసాత్మక చరిత్ర రుజువు చేస్తున్నది. అన్ని దేశాలు ఉగ్ర కోరల్లో చిక్కి విలవిల్లాడడం చూస్తున్నాం. గత శతాబ్ద కాలంలో జరిగిన పలు ముఖ్య ఉగ్ర దాడుల వివరాలను చూస్తే ఉగ్ర విషకోరలు ఎంత ప్రమాదకరమో అవగతం అవుతుంది. 1920లో న్యూయార్క్ వాల్ స్ట్రీట్ ఉగ్రదాడుల్లో 40 మంది, 1946లో జెరుసాలెం బాంబు దాడుల్లో 91 మంది, 1961లో పార్సియన్ గల్ఫ్‌లో 238 మంది, 1978లో ఇరాన్ సినిమా రెక్స్ ఫైర్‌ఫాక్స్ 470 మంది, 1983లో బీరూట్ లెబనాన్‌లో 307 మంది, 1988లో స్కాట్‌లాండ్‌లో 270 మంది, 1992లో అర్జంటీనాలో 242 మంది మరణించడం జరిగింది. 1993లో అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూల్చివేతలో ఆరుగురు మరణించగా 1,042 మంది గాయపడడం, 1994లో ర్వండాలో 1,139 మంది, 1997లో అల్జీరియాలో జరిగిన వివిధ దాడుల్లో 1200లకు పైగా ప్రాణాలు కోల్పోవడం జరిగింది. 1998లో టాంజానియాలో 224 మంది, 1999లో రష్యాలో 307 మంది అమాయకులు ఉగ్రవాదుల దాడుల్లో కన్ను మూశారు. 2001లో ఆంగోలాలో 252 మంది, 2001 సెప్టెంబర్ 11న అమెరికాలో జరిగిన అల్‌ఖైదా దాడుల్లో 2,996 మంది ప్రాణాలు కోల్పోయారు. 2002లో ఇండోనేషియాలో 204 మంది, 2007లో ఇరాక్‌లో 796 మంది 2014లో ఇరాక్‌లో 1,700 మంది, 2014లో ఇరాక్‌లో 953 మంది, 2017లో అఫ్ఘానిస్థాన్ కారు బాంబు దాడుల్లో 150 మంది, 2019లో శ్రీలంకలో 259 మంది, 2020లో ఇథియోపియా 766 మంది, 2022లో నైజీరియాలో 200 మంది, 2023లో పాకిస్థాన్‌లో 101 మంది, 2023లో ఇజ్రాయిల్‌లో 1,207 మంది, 2024లో ఇరాన్‌లో 105 మంది, 2025లో అమెరికాలో 15 మంది, 2025లో భారత్‌లో 28 మంది అమాయకులు లేదా భద్రతా దళాలు ఇస్లామిక్ ఉగ్రవాదుల చేతుల్లో నిండు ప్రాణాలు కోల్పోయారు. భారతదేశ చరిత్రలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద దాడులు సర్వసాధారణం అయ్యాయి. భారత్‌లో 2007 నుంచి 2017 వరకు ఇస్లామిక్ తీవ్రవాదులు జరిపిన 12,002 దాడుల్లో 19,866 మంది అమాయకులు లేదా భద్రతా దళాలు మరణించగా, 30,544 మంది గాయపడ్డారు. భారత్‌లో ఉగ్రవాదులు జరిపిన ముఖ్యమైన దాడుల్లో 1993లో జరిగిన ముంబాయి దాడుల్లో 257 మంది, 2001లో పార్లమెంట్‌పై దాడిలో ఐదుగురు, 2006లో జరిగిన ముంబాయి రైలు దాడుల్లో 209 మంది, 2008 ముంబాయి బాంబు దాడుల్లో 166 మంది, 2016 కె అండ్ కె ఊరి దాడుల్లో 19 మంది సైనికులు, 2019 పుల్వామా దాడుల ఘటనలో 40 మంది సైనికులు, 22 ఏప్రిల్ 2025 పెహల్గామ్ దాడుల్లో 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పెహల్గామ్ దుర్ఘటన తర్వాత భారత్ ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ప్రతి చర్యలో భాగంగా పాకిస్థాన్‌లోని 09 ఉగ్ర స్థావరాలు నేలమట్టం కావడం, తదనంతర ఆపరేషన్ సింధూర్ 2.0 దాడుల్లో పాక్‌లోకి ముఖ్య మిలటరీ స్థావరాలను నేలమట్టం చేయడంతో పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడం, తాత్కాలిక కాల్పుల విరమణకు రావడం మనకు తెలుసు. ఇక నుంచి ఏ చిన్న ఉగ్రదాడులా భారత్‌లో జరిగినా, దానిని యుద్ధంగా భావిస్తామని భారత్ పేర్కొనడం సముచితంగా ఉన్నది. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిందే. ఉగ్రవాదుల్ని నిర్దయగా అంతం చేయాల్సిందే. అభివృద్ధికి ప్రతిబంధకంగా నిలుస్తున్న ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ, ఉగ్రవాదుల కదలికలను కట్టడి చేస్తూ, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలతో దౌత్య సంబంధాలను తుంచుకొని కఠిన చర్యలు తీసుకోవలసిందే. భారత 6వ ప్రధాని రాజీవ్ గాంధీని 21 మే 1991న తమిళనాడు, శ్రీపెరంబుదూర్ నగరంలో ఉగ్ర దళాలు బెల్ట్ బాంబులు ధరించి చేసిన బాంబు దాడుల్లో మరణించడం మనకు తెలుసు. ఈ దుర్ఘటనకు గుర్తుగా ప్రతి ఏట 21 మే రోజున దేశవ్యాప్తంగా "జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం" లేదా "నేషనల్ ఆంటీ–టెర్రరిజమ్ డే" పాటించుట ఆనవాయితీగా మారింది. ఉగ్రవాద దుష్ప్రభావాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, యువతకు శాంతియుత సన్మార్గం చూపడం, ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులు అర్పించడం, ఉగ్రవాదం పట్ల సదస్సులు/చర్చలు/విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, ప్రపంచ శాంతి/ఐక్యత/మతసామరస్యాలను నెలకొల్పడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. 2025 జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం ఇతివృత్తంగా "ఉగ్రవాదం వద్దు, శాంతి సహజీవనమే ముద్దు" అనే నినాదాన్ని తీసుకోవడం జరిగింది. నేటి యువత దృష్టిని ఉగ్రవాదం నుంచి దూరం చేయడం, వారిలో దేశభక్తిని రగల్చడం, జాతీయ సమైక్యత ప్రయోజనాలను వివరించడం, ప్రేమ పునాదిగా పౌర సమాజం ముందుకు సాగడం, ఉగ్రదాడుల్లో గాయపడిన వారికి ఆపన్నహస్తం అందించడం, శాంతియుత సహజీవనానికి రాచబాటలు వేయడం ప్రస్తుత కర్తవ్యంగా భావించాలి. ఉగ్రవాదాన్ని మట్టుబెట్టి, మానవీయతను ఆలింగనం చేసుకుందాం.

# తేనీటితో మానసిక ఉల్లాసం

టీ ఉత్పత్తి చేసే దేశాలలో, ముఖ్యంగా తలసరి వినియోగం సాపేక్షంగా తక్కువగా ఉన్న టీ ఉత్పత్తి చేసే దేశాలలో డిమాండ్‌ను విస్తరించే దిశగా ఎక్కువ ప్రయత్నాలు చేయాలని, సాంప్రదాయ దిగుమతి చేసుకునే దేశాలలో తగ్గుతున్న తలసరి వినియోగాన్ని పరిష్కరించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని ఇంటర్ గవర్నమెంటల్ గ్రూప్ ఆన్ టీ పిలుపును తిరిగి నొక్కి చెబుతూ, జనరల్ అసెంబ్లీ మే 21ని అంత ర్జాతీయ టీ దినోత్సవంగా ప్రకటించాలని నిర్ణయించింది. తేనీరు ఒక పానీయం. తేయాకును నీటిలో మరిగించి వచ్చిన ద్రావకాన్ని తేనీరు (టీ) అంటారు. మానవ దేహానికి ఉత్తేజాన్ని కల్గించే ఆహార పదార్ధాలలో టీ ప్రథమ స్థానంలో ఉంటుంది. దీనిలో పంచదార, పాలు కలుపుకొని త్రాగుతారు. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయే వరకు మనిషి జీవితంలో టీ పాత్ర అమోఘమైంది. నిస్సత్తువగా ఉన్నా, ఉల్లాసంగా ఉన్నా టీ త్రాగడానికి అత్యంత ఉత్సాహాన్ని చూపడం జీవితంలో ఓ అంతర్భాగమై పోయింది. సగటు భారతీయుల్లో దాదాపు సగం మందికి పైగా టీ సేవిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం మానసిక విశ్రాంతి కోసం కాఫీ సేవించడం అలవాటుగా ఉండేది. ఇళ్ళలో కూడా కాఫీ మాత్రమే వాడుకలో ఉండేది. ఫిల్టర్ కాఫీ బాగా వాడుకలో ఉన్న రోజుల్లో ఇన్‌స్టంట్ కాఫీలు రావడం, వాటితోపాటు పలు రకాల టీ పొడర్లు మార్కెట్‌లోకి విడుదల కావడం, టీకి జనసామాన్యంలో అధిక వినియోగం ఏర్పడడం, పైగా అది సామాన్య మానవుడికి అందుబాటు ధరలలో లభించడం టీకి మరింత ప్రాధాన్యత పెరగడానికి దోహదపడింది. చరిత్ర ప్రకారం.. టీని క్రీస్తుపూర్వం మొదటిసారిగా 2737లో చైనా చక్రవర్తి షెన్‌నంగ్ కనిపెట్టారు. ఆయన తాగే వేడి గిన్నెలో టీ తేయాకు పడిందట.. దాని నుంచి వచ్చిన టేస్ట్ ఆయనకు నచ్చడంతో మొదట బ్లాక్ టీ పుట్టుకొచ్చింది. ఆ తరువాత టీని...మనం తాగే విధంగా తయారు చేయడానికి 3 సంవత్సరాలు పట్టింది. అలాగే శతాబ్దాలుగా టీని ఔషధంగా వాడుతూ వచ్చేవారు. టీని తాగడానికే కాకుండా.. వివిధ రకాల మందులో విరివిగా ఉపయోగించేవారు. 15వ శతాబ్దంలో నాగరిక ప్రపంచంలో టీ త్రాగడం ప్రారంభ మయ్యింది. 17వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వినిమయ పద్ధతిలో బట్టలు, వెండికి, అనధికారికంగా నల్లమందుకు బదులుగా టీని చైనా నుండి దిగుమతి చేసుకునేది.చైనా నుండి బ్లాక్, గ్రీన్ టీ రకాల విత్తనాలను లార్డ్ మెకార్డెనీ తెప్పించి, భారతదేశంలో 1793 లో కలకత్తా బొటానికల్ గార్డెన్స్‌లో ప్రవేశ పెట్టాడు. ఇవి పశ్చిమ బెంగాల్, కచార్, నీలగిరి ప్రదేశాలలో నాటబడ్డాయి. చాలాకాలం తర్వాత 1823 లో బ్రిటన్‌కు చెందిన బ్రూస్ సోదరులు అస్సాంలో దేశీయంగా తేయాకును కనిపెట్టి నప్పుడు భారతదేశంలో టీ ఉత్పాదన ప్రారంభమయ్యింది. విస్తారంగా టీ వృద్ధి చెందే ప్రాంతాలను వీరు కనుగొన్నారు. ఇవి సింగ్‌ఫో జాతులు తోటల పెంపకంలో మిగిలినవై ఉండవచ్చు. ఈ కొండ ప్రదేశాలలో జనులు టీ ఆకులతో చేసిన నాటు సారాను త్రాగుతూ ఉండేవారు. మొట్టమొదట 1838 లో దిబ్రుఘర్ నుంచి 8 పెట్టెలు ఎగుమతి చేయ బడ్డాయి. ఈ బ్లాక్ టీ సౌచోంగ్, పీకో అని రెండు గ్రేడులుగా చాలా ప్రసిద్ధి పొందింది. చైనాతో 1833 లో ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్య వ్యాపార సంబంధాలు చెడిపోయి నప్పుడు, ఇంగ్లాండు భారతదేశంలో టీ ఉత్పాదనకు తీవ్ర మైన ప్రయత్నాలు ప్రారంభించింది. 1860 కి చైనా టీ ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధిపొందింది. 1880లలో అమెరికాలో మొదటిగా టీ బ్యాగుల వాడకం మొదలైంది. వ్యాపారం నిమిత్తం అక్కడివారికి టీని టేస్ట్ చేయడానికి టీ పొడిని చిన్న బ్యాగుల్లో వేసి ఇచ్చారు. 18వ శతాబ్దం నుంచీ రెండో ప్రపంచ యుద్ధం వరకూ అమెరికాలో గ్రీన్ టీ ఫేమస్. తైవాన్‌లో 1980 నుంచీ బబుల్ టీ అంటే బుడగల టీ వాడకంలో ఉంది. చిక్కటి టీని గిలక్కొట్టి ఇస్తారు. 1904లో వర్జీనియాలో ఐస్‌టీని కనిపెట్టారు. కొన్ని ఐస్ ముక్కలపై టీని పోసి తాగేవారు.నేడు అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రాంతాలు భారతదేశంలో టీని అధికంగా ఉత్పాదించే రాష్ట్రాలుగా ప్రసిద్ధి పొందాయి. భారతదేశపు టీ ఉత్పాదక ప్రదేశాలలో త్రిపుర, కర్ణాటక, మణిపూర్, సిక్కిం, అరుణా చలప్రదేశ్ ముఖ్య పాత్రను వహిస్తున్నాయి. నీలగిరి కొండలలో భారత దేశపు ఉత్తమ రకం టీ ఉత్పాదించ బడుతుంది. మొత్తం సుమారు 98 శాతం టీని ఉత్పాదిస్తున్నాయి. సతత హరితపు మొక్క అయిన టీకి వర్షపాతం అధికంగా ఉండాలి. అప్పుడే అది పుష్కలంగా, సమృద్ధిగా పెరుగుతుంది. దిగుబడి అధికంగా ఉంటుంది. సముద్ర మట్టానికి ఎత్తుగా ఉండే ప్రదేశాలలో పెరిగే టీ ఉత్తమమైనది. కానీ మైదానాలలో పెరిగే టీ వల్ల అధిక ఫలసాయం వస్తుంది. దాదాపు ప్రతి దేశంలోనూ టీ వినియోగంలో ఉన్నా భారతదేశం ఉత్పాదించే టీ వైవిధ్యానికీ, విశిష్టతకూ ప్రసిద్ధి పొందింది. పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ టీ మిక్కిలి నాణ్యమైనది. ఇది సువాసన భరితమైనది. ముఖ్యంగా ఇక్కడి మంచుతో కూడిన హిమాలయ పర్వత వాతావరణ పరిస్థితుల వల్ల, ఈ ప్రదేశంలో భూసార రచనా విధానం వల్ల ఇక్కడ ఉత్పత్తి కాబడే టీకి ప్రత్యేక రుచి, సువాసన సిద్ధిస్తుంది. భారతదేశంలో తేయాకు సాగు ప్రాతిపదికగా అనేక మందికి జీవనోపాధి కలుగుతోంది. ఈ రంగంలో సుమారు 20 లక్షల మంది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ శ్రామికులు ఉన్నారు. వీరిలో 50 శాతం స్త్రీలు ఉన్నారు. చైనా, జపాన్‌లలో టీ త్రాగడం విస్తారమైన తంతుతో కూడిన ఒక గొప్ప ఉత్సవం గా పరిణమించింది. అక్కడ టీ డికాక్షను కాచి పంచదార, పాలు కలపకుండా త్రాగుతారు. ఒక్కొక్కప్పుడు నిమ్మరసం, పంచదార కలిపి త్రాగుతారు. అమెరికాలో సామాన్యంగా టీలో ఐస్ వేసి, పంచదారతో త్రాగుతారు. భారతదేశం, బ్రిటన్‌లలో పాలు, పంచదార కలిపి త్రాగుతారు. టిబెటియన్‌లు గ్రీన్ టీని ఉప్పు, యాక్ వెన్నతో కొయ్య కప్పులలో త్రాగుతారు. ఆఫ్రికాలో డికాక్షనును చిలికి నురగగా తయారు చేసి త్రాగుతారు. పశ్చిమ ఆసియాలో టీని యాలకులతో కలిపిన డికాక్షన్‌తో త్రాగితే, భారత దేశంలో గుజరాతీలు మసాలా టీ త్రాగుతారు. బ్లాక్ లేక గ్రీన్ టీని ఏలకులు, కొట్టిన బాదంపప్పు కలిపి కహ్వా అని కాశ్మీరీలు త్రాగుతారు. ఇది చాల పుష్టికరమైన, రుచికరమైన పానీయం. గ్రీన్ టీ లేదా ఆకుపచ్చ తేనీరు, అల్లం తేనీరు, తెల్ల తేనీరు, నల్ల తేనీరు, డార్జిలింగ్ టీ ఇలా పలు రకాలుగా ఉన్నాయి. టీ సహజమైన పానీయం. దీనిలో రసాయనిక పదార్ధాలుగానీ, కృత్రిమ సువాసనల ద్రవ్యాలుగానీ, ఇతర రంగులుగానీ చేరి ఉండవు. ఇది ఆరోగ్యదాయకమైన, శక్తిదాయకమైన పానీయం. దీనిలో విటమిన్లు ముఖ్యంగా బీ గ్రూప్ విటమిన్లు, రిబోఫ్లేవిన్, నియాసిన్ ఉంటాయి. దీన్లో అతి తక్కువగా లభించే కెఫీన్ మానవ శరీరానికి ఆరోగ్యకరమైనది. అపాయకారి కాదు. తేనీరువల్ల కలిగే ప్రయోజనాలలో, రోజూ టీ తాగేవాళ్లలో ఎముకలు బలంగా ఉంటాయి. బ్లాక్ టీ తాగేవారిని ఫ్లూ జ్వరాలు లాంటివి అంత త్వరగా దరిచేరవు. రోజూ మూడు నాలుగు కప్పుల టీ తాగేవారిలో గుండె పోటు ప్రమాదం 21 శాతం తగ్గుతుంది. టీలో ఉండే ఫ్లోరైడ్ దంతాలు దృఢపడేందుకు సాయపడుతుంది. తేనీరులోని ఫ్లేవనాయిడ్స్ గుండెను ఆరోగ్యవంతంగా పనిచేయిస్తాయి. గ్రీన్, బ్లాక్ టీలలో ఉండే ఎల్–థయానైన్ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ రాకుండా కాపాడతాయి. అనేక రకాల అలెర్జీలకు టీ విరుగుడు. టీ డీహైడ్రేషన్ సమస్యనూ దూరం చేస్తుంది. అలాగే టీ వల్ల నష్టాలూ లేక పోలేదు. ఆహారముతో పాటు టీని తీసుకుంటే ఆహారము లోని పోషక పదార్థములు శరీరము గ్రహించడంలో ఇబ్బంది కలుగుతుంది. ముఖ్యంగా ' ఐరన్ ' టానిన్ తో కలిసి పనికిరాకుండా పోతుంది. టీ ఎక్కువగా తాగితే కడుపులో అసిడిటీ పెరిగి అల్సర్ రావడానికి అవ కాశ ముంటుంది. టీ మెదడుని ఉత్తేజ పరిచి నందున శరీరం హుషారుగా ఉన్నా కొంత సేపటికి దాని ప్రభావము తగ్గి మెదడు డిప్రెషన్ కు లోనవుతుంది. విద్యార్థులు టీ తాగి నిద్ర రాకుండా చదివినా, ఏకాగ్రత ఎక్కువ సేపు నిలువదు. టీ ఎక్కువ సార్లు త్రాగే వారికి ఆకలి మందగించి భోజము తీసుకోవడం తగ్గడం వలన ఆరోగ్యము క్షీణిస్తుంది.

## ఆనాటి కాంగ్రెస్ పెటెంట్ సింబల్

# కాసు బ్రహ్మానందరెడ్డి

భారత దేశ రాజకీయాలను ఒంటి చేత్తో కొంతకాలం శాసించిన ఇందిరా గాంధీని స్వంత పార్టీ కాంగ్రెస్ నుండి బహిష్కరించింది ఎవరో తెలుసా? ఆయన అపార రాజకీయ అనుభవం కలిగిన నాటి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఒక తెలుగువారు కావడం విశేషం. ఆయనే రాష్ట్ర కేంద్ర రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం కలిగిన దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి గుంటూరుకు చెందిన కాకలు తీరిన నాయకుడు కాసు బ్రహ్మానందరెడ్డి. ఆనాటి కాంగ్రెస్ పెటెంట్ సింబల్ అయిన ఆవుదూడ గుర్తు కనుమరుగు అయి, నిట్టనిలువునా రెండుగా చీలిన కాంగ్రెస్ చీలి పోయిన ఈ సంఘటన గురించి తెలుసు కోవాలంటే నాలుగు, అయిదు దశాబ్దాల క్రితం నాటికి వెళ్లాల్సిందే.. స్వాతంత్ర్యానంతరం, ఎమర్జెన్సీ ప్రభావ ఫలితంగా, కాంగ్రెస్ పార్టీ1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో పార్టీ ఊహించని రీతిలో తొలి ఓటమిని చవి చూసింది. అనంతరం దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామాలు క్రమానుగతంగా జరిగాయి. 1977 లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాసు బ్రహ్మానందరెడ్డి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన నేత సిద్ధార్థ శంకర్ రే పోటీ పడ్డ నేపథ్యంలో రాజకీయ చతురతతో బ్రహ్మానందరెడ్డి విజయం సాధించి నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షులు అయ్యారు. ఆ క్రమంలో ఇందిరాగాంధీతో విభేదాలు తలెత్తాయి. ఇందిర తనవర్గంతో కలిసి సొంత కుంపటి పెట్టుకున్నారు. తర్వాత ఇందిరా కాంగ్రెస్ గా పేరు పెట్టుకున్నారు. అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగి, అలా ఎన్నికైన అతి కొద్ది మంది అధ్యక్షులలో ఆయన ఒకరు. దాంతో 1978 జనవరి 1న ఇందిరను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు అప్పటి అధ్యక్షుడు కాసు బ్రహ్మానందరెడ్డి ప్రకటించారు. అలా ఒక వర్గానికి ఇందిరాగాంధీ నాయకత్వం వహించగా, మరో వర్గానికి కాసు సారథ్యం వహించాడు. "ఇందిరా కాంగ్రెస్" కు పోటీగా ఆయన నేతృత్వంలోని పార్టీ ఆయన పేరుతోనే "రెడ్డి కాంగ్రెస్" గా రూపాంతరం చెందింది. కాసు బ్రహ్మానందరెడ్డి (జూలై 28, 1909 – మే 20, 1994) బ్రహ్మానందరెడ్డి 1909 జూలై 28 న గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపాన తూబాడు గ్రామంలో జన్మించారు. పన్నెండటవ ఏట విజయవాడ కాంగ్రెసు సదస్సుకు విచ్చేసిన మహాత్మా గాంధీని సందర్శించారు. గాంధీజీ బోధనలో ప్రభావితుడై జీవితాంతం గాంధీ టోపీ, ఖద్దరు దుస్తులు ధరించారు. టంగుటూరి ప్రకాశం పంతులు సాహచర్యం, బోధనలు అతనిని స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపాయి. లా ప్రాక్టీసును పక్కనబెట్టి బ్రిటిషు వారిపై పోరాటానికి నడుం బిగించి, పలు మార్లుపోలీసు లాఠీ



దెబ్బలు తిన్నారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1942లో బ్రిటిషు వారికి వ్యతిరేకంగా కాంగ్రెసు పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా, గుంటూరు జిల్లాకు చెందిన తల పండిన రాజకీయ దురంధరుడు కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రి పదవులతో పాటు అనేక పార్టీ పదవులను నిర్వహించారు. జిల్లాబోర్డు సభ్యునిగా ఆయన రాజకీయ జీవితం ప్రాంరంభించి, మొదటి సారిగా 1946 లో మద్రాసు ప్రెసిడెన్సీ శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1952 లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పల్నాడు నియోజకవర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేసి, సీపీఐ అభ్యర్థి కోలా సుబ్బారెడ్డి చేతిలో ఓడిపోయారు. 1955 లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఫిరంగిపురం నియోజకవర్గం నుండి కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1952నుండి 1956 వరకు రాష్ట్ర కాంగ్రెసు కమిటికి ప్రధాన కార్యదర్శిగా పనిచేసారు. 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఆంధ్ర రాష్ట్ర శాసన సభ్యులంతా ఆంధ్రప్రదేశ్ లోనూ సభ్యులుగా కొనసాగారు. ఆ విధంగా బ్రహ్మానందరెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సభ్యుడై, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో పురపాలన శాఖ మంత్రిగా, దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ, ఆర్థిక శాఖలు నిర్వహించారు. 1964 ఫిబ్రవరి 29 న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. ఉవ్వెత్తున ఎగసిన అప్పటి తెలంగాణ ఉద్యమం కారణంగా కాసు... 1971 సెప్టెంబరు 15న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. పీవీ నరసింహారావు సీఎం అయ్యారు. అలా కాసు, కేంద్రమంత్రి వర్గంలో 1974 వ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టి, కమ్యూనికేషన్, హోం, పరిశ్రమల శాఖలను నిర్వహించాడు. 1978 లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ఇందిరా కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఫలితంగా రెడ్డి కాంగ్రెసును 1980 లో ఇందిరా కాంగ్రెసులో విలీనం చేశారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు పరిచారు. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే దీర్ఘకాలిక ప్రాజెక్టుల పనులను పూర్తి చేయించారు. బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జున సాగర్ పనులు కాసు హయాంలోనే పూర్తయ్యాయి. సాగర్ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణకు ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాగార్జున సాగర్ మొదటిదశ పూర్తి కాగానే, 1966 ఫిబ్రవరి ఆగస్టు 3న నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారు. రాయలసీమ ప్రాంత వరదాయిని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ ప్రాజెక్టుకు అవసరమైన క్లియరెన్సుల మంజూరు, నిధులు సమకూర్చుడానికి కాసు బ్రహ్మానంద రెడ్డి కృషి చేసారు. పోచంపాడు ప్రాజెక్టుకు రూపకల్పన చేసారు. అప్పట్లో ఎల్.ఐ.సి.నుంచి పది కోట్ల రూపాయల రుణాన్ని తీసుకుని బలహీనవర్గాల వారికి ఇళ్లు నిర్మించారు. ఆయన హయాంలో పంచాయతీ చట్టం అమలులోకి తెచ్చారు.

## మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు, నూతన వ్యవసాయక మార్కెట్

# చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసన

**గుంతకల్లు మే 20 (ప్రజాజోతి):** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు ) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాలను తీసుకొని రావడానికి వ్యతిరేకిస్తూ వాటిని ఉపసంహరించు కోవాలని మరియు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని,ఎనిమిది గంటల పని విధానాన్ని పరిరక్షించాలి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలి,కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చెయ్యాలి,ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలి,ప్రభుత్వ ఉద్యోగు లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలి,సంఘటిత, అసంఘటిత కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ కార్మిక చట్టాలను వర్తింప చేయాలి తదితర డిమాండ్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి చేస్తూ స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 22వ సార్వత్రిక సమ్మెను నిర్వహించవలసి నది ఉన్నది అయితే దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితులు ఉన్నాయని 10 జాతీయ కార్మిక సంఘాలు జులై 9 వ తారీకున సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని వాయిదా వేయడం జరిగినది.అయితే ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ ఈ విషయంలో విభేదిస్తూ కార్మికులు ఇప్పటికే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి అనేక రోజుల నుంచి ప్రచార ఆందోళన కార్యక్రమాలలో ఉన్నారని అందుకు పై డిమాండ్లను కేంద్ర




రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని కార్మికులకు ఐ ఎఫ్ టి యు కార్మిక సంఘం దేశవ్యాప్తంగా పిలుపునివ్వ డం జరిగినది.మోడీ ప్రభుత్వం తీసుకొని వస్తున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక హక్కులు నిర్వీరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు, బహుళ జాతి కంపెనీలకు, పెట్టుబడి దారి వర్గాలకు అనుకూలంగా ఉన్నాయని వీటిని అమలుపరిస్తే కార్మికు లు కట్టు బానిసలుగా పని చేసే పరిస్థితి ఉంటుందని, ఇప్పుడు ఉన్న కార్మిక చట్టాలను అమలు పరచకుం డా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకుంటూ కార్మికులతో 12 గంటల పని విధానాన్ని కొనసాగిస్తూ కార్మికుల శ్రమ ని దోపిడీ చేస్తున్నారని లేబర్ కోడ్లు వస్తే మరింత దోపిడీకి గురై ఉద్యోగ భద్రత,కార్మిక హక్కులు లేకుండా జీవించే పరిస్థితి ఉన్నది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నడంతో వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు అభద్రత భావంతో జీవించడం జరుగుతున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు అనేక నెలల నుండి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకం గా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. ఇప్పటికైనా ఈ విధానాలను మోడీ ప్రభుత్వం ఉపసంహ రించుకోవాలని లేకపోతే కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమా లు చేపట్టే పరిస్థితి ఉన్నదని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తు న్నామన్నారు.ఈ కార్యక్ర మంలో ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు రఘునాథ్ రెడ్డి,రాందాస్, పట్టణ కార్యదర్శి రామాంజనే యులు,సత్తార్, నారాయణ, షేక్షావలి,భాష,విశ్వనాథ్, గోపి,రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# లేఅవుట్లో ప్రభుత్వ భూములను పంచాయతీకి అప్పగిస్తాం

**విజయనగరం జిల్లా, శృంగవరపు కోట., ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము: శృంగవరపు కోట.** మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ పరిధిలో గల ఎస్ వి ఎన్ స్వప్నలోక్ లేఅవుట్ లో ప్రభుత్వ భూమి ఉంటే ఆ భూమిని పంచాయతీకి అప్పగిస్తామని ఎస్ వి ఎన్ శ్రీనివాస సుజాత గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా స్వప్నలోక్ లేఅవుట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ. గత 40 ఏళ్లగా ఎటువంటి ఆరోపణలు లేకుండా వ్యాపారాలలో ఎదుగుతూ వస్తున్న తమపై కొంతమంది ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మా వ్యాపారాల వలన ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామే తప్ప ఎవరిని ఇబ్బందులు పెట్టలేదని ఈ లే అవుట్ లో అన్ని సక్రమంగా ఉన్నాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఎటువంటి అవకతవకలు జరగలేదని ధ్రువీకరించారని ఇక్కడ ఉన్న నాలుగు చెరువులలో ఏ ఒక్క



చెరువు యొక్క అంగుళం భూమి కూడా మేము ఆక్రమించలేదని ఎటువంటి సందేహాలు ఉన్న సర్వే చేసి చూసుకోవచ్చునని ఆయన తెలిపారు. మూషిడిపల్లి మాజీ సర్పంచ్ కనకం మాట్లాడుతూ. గ్రామ సభ ద్వారా పంచాయతీ అనుమతితోనే లే అవుట్ లో రోడ్డు నిర్మాణం చేపట్టారని ఈ లే అవుట్ వలన చుట్టుపక్కల వారికి ఉపాధి లభిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఈశ్వర్ కౌశిక్, ముషిడిపల్లి, చిన్నకండేపల్లి గ్రామ నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి


**విజయనగరం జిల్లా, శృంగవరపుకోట మండల, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శృంగవరపుకోట మండల కేంద్రంలో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాల ఇచ్చిన పిలుపులో భాగంగా మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన కార్యక్రమం చేపట్టారు ఈకార్యక్రమాన్నిఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఇప్పుడున్నది పర్మనెంట్ ఉద్యోగాల వ్యవస్థ. పర్మనెంట్ పనికి పర్మనెంట్ పోస్టులు, ఆ పోస్టులలో పర్మనెంట్ ఉద్యోగులు వుండాలనేది ఈ వ్యవస్థ సూత్రం. కానీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం పర్మనెంట్ ఉద్యోగాల వ్యవస్థ స్థానంలో 'ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లొరుమెంట్' పేరుతో తాత్కాలిక ఉద్యోగాల వ్యవస్థను తీసుకొచ్చే పనిలో వున్నది. మోడీ ప్రభుత్వం చేసిన 4 లేబర్ కోడ్లలో పారిశ్రామిక సంబంధాల కోడ్ ఒకటి. ఈ కోడ్ ప్రకారం మేనేజ్మెంటుకు-ఉద్యోగికి మధ్య కుదిరే కాంట్రాక్ట్ ప్రకారం ఉద్యోగం ఎంత కాలం అనేది ముందుగా నిర్ణయిం చబడుతుంది సంవత్సరం, నాలుగు సంవత్సరాలు, ఐదు సంవత్సరాలు ఇలా ఉద్యోగం గడువు ముందే నిర్ణయించబ డుతుంది. గడువు తీరిన తరువాత ఉద్యోగం కొనసాగదు. మేనేజ్మెంటు ఇంకొక టర్మ్ పొడిగించవచ్చు. లేదా అక్కడ దొరక్కపోతే ఇంకొక చోట ఉద్యోగం కోసం వెతుక్కోవాలి. కాబట్టి ఒక ఉద్యోగిని పర్మనెంట్ చేయకుండా అదే పోస్ట్లో ఎన్ని టరమ్లైనా వినియోగించుకోవచ్చు. ఈ కోడ్ గనుక అమలులోకి వస్తే ఈ విధంగా పర్మనెంట్ ఉద్యో గాలలో ఎప్పటికీ తాత్కాలికంగా మాత్రమే ఉండే ఉద్యోగులను నియమించుకునే అధికారం యాజమాన్యాలకు లభిస్తుంది. పర్మనెంట్ ఉద్యోగులను తొలగించి వారి స్థానంలోతాత్కాలిక ఉద్యోగులను నియమించే పరిస్థితి వస్తుంది. దీని వలన పర్మనెంట్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుంది ఇంతేగాక ఈ 'ఫిక్స్డ్ టర్మ్' ఉద్యోగులు టర్మ్ అయిన తరువాత అదే సంస్థలో మరో టర్మ్ ఉద్యోగం దొరుకుతుందా లేక మరొక చోట ప్రయత్నించాలా అనే ఆందోళనతో నిరంతరం ఉంటారు కాబట్టి మేనేజిమెంటు తమ హక్కులను అమలు చేయక పోయినా భరించటమే గాని ఎదిరించలేని పరిస్థితిలో వుండరు. యూనియన్లు, డిమాండ్లు, డిమాండ్లపై మేనేజ్మెం ట్లతో చర్చలు, ప్రదర్శనలు, సమ్మెలు నామమాత్రం అవుతాయి. పర్మనెంట్ ఉద్యోగులు, యూనియన్లు, డిమాండ్లు, వాటిపై చర్చలు, ఆందోళనలు సమ్మెలు లేని పరిస్థితి కావాలనే కార్పొరేట్ల కోరిక నెరవేరుతుంది. 'ఫిక్స్డ్ టర్మ్' ఎంప్లొరుమెంట్'లో రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి ఈ తాత్కాలిక ఉద్యోగాల వ్యవస్థలో సామాజిక న్యాయం కరువవుతుంది.ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లొరుమెంట్'కు వీలుగా అందుకు సంబంధించి ఎటువంటి చట్టం చేయకుండానే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా వాజ్‌పేయి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తరువాత వచ్చిన యుపిఏ-1 ప్రభుత్వం%ొ%కార్మిక సంఘాల ఒత్తిడి వలన, మద్దతిస్తున్న వామపక్షాల ఒత్తిడి వలన ఈ ఉత్తర్వును ఉపసంహరించింది. కానీ మోడీ ప్రభుత్వం 2018లో ఈ 'ఫిక్స్డ్ టర్మ్' ఎంప్లొరుమెంట్'కు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేసింది.






2019లో స్వంత మెజారిటీతో రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగు లేబర్ కోడ్లను పార్లమెంట్లో ఆమోదింపజేసి చట్టాలుగా చేసింది.ఈ నాలుగు లేబర్ కోడ్లు (1) వేతనాల కోడ్ 2019 (2) పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, (3) సాంఘిక భద్రత కోడ్ 2020, (4) వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్స్ కోడ్. ఇప్పుడు ఈపారిశ్రామికసంబంధాల కోడ్ 2020లో చేర్చింది ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లొరుమెంట్'ను చట్టబద్ధం చేసిందిమొత్తం నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం 2019, 2020 లోనే చట్టలుగా చేసినప్పటికి కార్మిక వర్గ ప్రతిఘటన వలన వీటిని అమలు చేసే తేదీ ప్రకటించకుండా పెండింగ్లో వుంచింది. కానీ స్వంత మెజారిటీ లేనప్పటికీ కొందరు మిత్రుల మద్దతుతో 2024లో మూడవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృతంగా అమలు చేస్తున్నది. ఈ క్రమంలో భాగంగానే ఈ లేబర్కోడ్ల అమలుకు తేదీలుప్రకటించేందుకు సంసిద్ధమవుతున్నది.కాబట్టి ఈ 4 లేబర్ కోడ్లను, అందులో భాగంగా వున్న ఫిక్స్డ్టర్మ్ ఎంప్లొరుమెంట్'ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లు వి కన్నబాబు వి చిన్న బి కనకమహేశ్వరరావు పి నాగరాజు.ఏ అప్పారావు బి అప్పారావు.పి నాగరాజు వై స్వామినాయుడు ఎం సత్యం. ఎం అశోక్. కె గణేష్ బి సూరిబాబు . స్వామి నాయుడు ఎం.సత్యనారాయణ.జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు


## ఈ నెల 22న పోలవరం ప్రాజెక్టు శ్రీ అభయాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవం





**పోలవరం మే 20 :** పోలవరం ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ సంరక్షకులు ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగా పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే కొండపై వెలిసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి 16వ వార్షికోత్సవం జయంతి మహోత్సవము జరగనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం తమలపాకులు, గంధ సిందూరంతో స్వామివారి పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న ప్రసాద వితరణ. కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులంతా ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## శ్రీవారి సేవలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే



**మే 20,తిరుపతి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి)** కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారిని కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను చేశారు.దర్శనం అనంతరం ఆలయ రంగనాయక మండపంలో వీరికి అధికారులు తీర్థ ప్రసాదాలను అందచేశారు.జనసేన పార్టీ 44వ వార్డ్ ప్రెసిడెంట్, నగర కార్యదర్శి సాయి దేవ్ యాదవ్ వీరితో ఉన్నారు.

## స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు గారికి యస్వీయూ ఘన నివాళి

**మే 20,తిరుపతి ప్రతినిధి,(ప్రజాజ్యోతి)** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలనా భవనంలోని ఆయన విగ్రహం దగ్గర ఉదయం 10:30 గంటలకు స్మారక కార్యక్రమం జరిగింది. యస్వీయూ ఉపకులపతి ఆచార్య సిహెచ్. అప్పారావు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. "టంగుటూరి ప్రకాశం పంతులు గారు ఒక మహోన్నత వ్యక్తిత్వం గల వారు .ఆయన నిర్భయ దేశభక్తి, నైతికత,ప్రగతిశీల ఆలోచన ఆంధ్రప్రదేశ్ చరిత్రపై చెరగని ముద్ర వేశాయి. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు, ఈ ప్రాంత అభివృద్ధికి, ముఖ్యంగా విద్యారంగంలో బలమైన పునాదులు వేసిన దార్శనిక రాజనీతిజ్ఞుడు కూడా.కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం మొదటి ముఖ్యమంత్రిగా ఆయన దార్శనిక నాయకత్వంలో 1954లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉద్భవించింది.రాయలసీమ ప్రాంతంలో ఒక ప్రముఖ ఉన్నత విద్యా సంస్థను ఏర్పాటు చేయడంలో ఆయన దూరదృష్టి మరువలేనిది.ఈరోజు మనం వారు ప్రతిపాదిత గొప్ప సూత్రాలను నిలబెట్టుకోవడానికి మనల్ని మనం పునరంకితం చేసుకుందాం ." అని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు "టంగుటూరి ప్రకాశం పంతులు గారు న్యాయవాదిగా గడించిన అనుభవం విద్య ,సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన అచంచలమైన నిబద్ధత మనలాంటి సంస్థలు అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం చేసింది. ఆయన దార్శనికత నుండి పుట్టిన విశ్వవిద్యాలయంగా, విద్యాపరంగా మాత్రమే కాకుండా సామాజిక స్పృహ కలిగిన విద్యార్థులను పెంపొందించే నైతిక బాధ్యత మనపై ఉంది." అని వారి సేవలను కొనియాడారు.అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు,విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆ నాయకుడికి నివాళులర్పించారు,



## రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 20** ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పోలవరంనియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకురాలు కొవ్వాసు. జగదీశ్వరి అన్నారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రంరూపురేఖలు మారబోతున్నాయని,, పోలవరం ప్రాజెక్టు, తదితర కీలక ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయగల సమర్థత కూటమి ప్రభుత్వం తో సీఎం చంద్రబాబు నాయుడుకి చెల్లుతుందని. కొవ్వాసు. జగదీశ్వరి అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో,రాష్ట్రాన్ని అప్పులమయంచేశారని అన్నారు.



# 100% ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోండి.

**గిరిజన సంస్కృతిని కాపాడండి.**

**మారిక గ్రామాన్ని ఆధానికి అప్పగించకండి.**

**సచివాలయంలో అభ్యంతర దరఖాస్తు ఇచ్చిన పోరాట నాయకులు.**

**ఏపీ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్..**



**విజయనగరం జిల్లా, వేపాడ మండలం, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో జకేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ ను కలసి మారిక గ్రామ యువకులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం జాకేరు పంచాయతీ కార్యదర్శి ప్రబుదాస్ ని అభ్యంతర దరఖాస్తుల అందజేశారు ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ సచివాలయంలో మా భూములను మా గ్రామాన్ని అదానికి అప్పగించే నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో మా మారిక గిరిజన కుటుంబాల అందరము 100% ఏకమై మా భూములను మా గ్రామాన్ని ఎటువంటి భూసేకరణ చేయవద్దని, సామాజిక అధ్యయనం కూడా చేయవద్దని మొదటి రోజు నుండి ఎమ్మార్వో కార్యాలయంలో వంటావార్పుతొ నిరసనతొ పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఎమ్మార్వో పై అధికారులందరికి గ్రామస్తులందరం గుజరాత్ కు చెందిన ఆదానే హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని, మా గిరిజన సంస్కృతిని జీవితాలను కాపాడాలని తెలియజేస్తున్న ఇప్పటికీ అదా నీకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోవడం ధరణమన్నారు

ఆధానికి అప్పగించే నిర్ణయాన్ని వెనకకు తీసుకోకపోతే ప్రాణలు తీసుకోవడానికి అయినా గిరిజనులు వెనకాడ బోరని తెలిపారు ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయానికి విలువ ఇవ్వాలని కోరార ఈ కార్యక్రమం చల్లా జగన్ తొ పాటు కరకవలస సర్పంచ్ పాత బోయిన పెంటమ్మ పోరాట కమిటీ నాయకులు జాలరి వీర్రాజు , గెమ్మెల అప్పలనాయుడు గమ్మల శ్రీను, కిల్లో అర్జున్ సిందేరి అసు, గెమ్మల బుజ్జిబాబు పాతబోయిన దేవుడు, పాలి దేవుడు శోభన్ బాబు,రమేష్,దేముడు గెమ్మెల బింగు తదితరులు పాల్గొన్నారు

# హనుమజ్జయంతి సందర్భంగా భక్తాంజనేయ స్వామికి గణపతి పూజ న్యాసపూర్వక ఏకవార పంచామృత అభిషేకం

**పైడిపల్లి. పణికుమార్ శర్మ**



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 20** పోలవరం గ్రామంలో అఖండ గోదావరి నది తీరమున వేయించేసి ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద వైశాఖ మాస కృష్ణపక్ష దశమి అనగా ది22-05-2025 గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి శ్రీ భక్తాంజనేయ స్వామికి గణపతి పూజ న్యాసపూర్వక ఏకవార పంచామృత అభిషేకం సింధూర అర్చన నాగవల్లి అర్చన పుష్పార్చన నిరాజన మంత్రపుష్పములు జరుగుతాయి కావున భక్తులందరూ పాల్గొని శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా పోలవరం ఆలయ కమిటీ తెలియజేశారు.

# ఎస్ కోట వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో విహారయాత్ర..



**విజయనగరం జిల్లా, శృంగారపు కోట మండలం, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఎస్ కోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో జరుగుచున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో మంగళవారం ఆటవిడుపుగా విహారయాత్రకి పుణ్యగిరి కొండపైకి ట్రెక్కింగ్ చేస్తున్న క్రీడాకారులు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు విలేకరులతో మాట్లాడుతూ వారంలో ఒకరోజు క్రీడాకారులకు ఆటవిడు పుగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన క్రీడాకారులు మానసిక ఉల్లాసం పెంపొంది, తోటి క్రీడాకారులతో అన్యోన్యత భావం పెంపొందు తోందని,, అంతేకా కుండా స్టామినా, కండరాల దృఢత్వం, మానసిక ధైర్యం, ఏదైనా సాధించగలమనే ఆలోచన భావం పెంపొందుతుందని అన్నారు. దీనికి కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల యాజమాన్యం క్రీడాకారులకు బస్సు సౌకర్యం సమకూర్చిందని. క్రీడాకారులకు అల్పాహారం దాతలు సమకూర్చారని, కోచ్ లు మహమ్మద్ ఖలీల్ ఉల్లా, ధరణికాన హారిక, పి. మౌనిక ఇతర కోచ్ లు క్రీడాకారుల తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించారని అన్నారు.

# త్యాగాలు చేసిన వారికి సాముచిత స్థానం





**నియోజకవర్గ మినీ మహానాడులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ**

**ఆచంటలో మినీ మహానాడు విజయవంతం**

**పోడూరు /ఆచంట,మే 20,ప్రజాజ్యోతి న్యూస్.** పార్టీకి త్యాగాలు చేసిన వారిని గుర్తించి భవిష్యత్తులో వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట నియోజకవర్గం టిడిపి మినీ మహానాడు కార్యక్రమం స్థానిక కమ్మ సంఘం కళ్యాణ మండపంలో మంగళవారం జరిగింది. జోరున వర్షం పడుతున్న నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మహానాడుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టపడిన వారికి గుర్తింపు నిస్తుందని రాబోయే కాలంలో యువతకు మరింత ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అరాచకం కొనసాగితే తమ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, జే బ్రాండ్స్ ద్వారా ఖజానాను లూటీ చేశారని దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ ఆపకుండా కొనసాగిస్తుందని త్వరలోనే విద్యార్థులకు తల్లికి వందనం. ఇటు రైతులకు భరోసా సాయం అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. అర్హులైన వారికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయటమే కాకుండా వారికి ఇల్లు కట్టించే బాధ్యతను కూడా తమ ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమినేతలు పూర్తి అవగాహనతో కలిసి ముందుకు వెళు తున్నారని అన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర మహానాడు ను కూడా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పితాని పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని అన్నారు. మహానాడులో ఆపరేషన్ సింధూర్లో విజయం సాధించిన జవాన్లకు అభినందనలు తెలిపారు అదే విధంగా వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. సభలో పాలు తీర్మానాలను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించారు. ఎమ్మెల్యే పితాని వేదికపై నియోజకవర్గంలోని గ్రామస్థాయి కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకటరామరాజు, ఆచంట జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, కేత మీరయ్య తమ్మినీడి ప్రసాద్, బడేటి బ్రహ్మాజీ, నక్క శ్యామల సోని తమనంపూడి శ్రీనివాసరెడ్డి, వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్ గణపతినీడి రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా పోలవరం పంచాయతీ ఆవరణలో నుండి ఏటిగట్టు సెంటర్ వరకు తిరంగా ర్యాలీ






**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ మే 20** ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని కూటమి నాయకులు అన్నారు. ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా పోలవరం పంచాయతీ ఆవరణలో నుండి ఏటిగట్టు సెంటర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవాహారంగా ఏర్పడి భారత్ మాతాకీ జై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బొరగం.వెంకటలక్ష్మి, మాట్లాడుతూ దేశంలో భారతీయులంతా ఐక్యంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుం దన్నారు.మన మేధా శక్తి ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గునపర్తి. చిన్ని, బొడ్డు. కృష్ణ, పాదం. ప్రసాద్, ఆకుల. రాజా, మంగిన. కొండ, కొణతాల. ప్రసాద్, జల్లేపల్లి. వెంకట చిరంజీవి, పిల్లి నాగరాజు, ఊడతా. గణేష్, మామిడిపల్లి. స్వాతి,బోరాగం. వెంకటలక్ష్మి, అల్లాడి. ఈశ్వరయ్య , చల్లా. వెంకటేశ్వరరావు, ముప్పుడి. రాజేష్, మాతు. అయ్యప్ప, తెల్లం. విష్ణుదొర, కూటమి నాయకులు గ్రామ ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ విషపూరిత లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి




**పోడూరు /పెనుగొండ, మే20,ప్రజాజ్యోతిన్యూస్.** మోడీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విష మాత్రలు నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెనుగొండ గ్రామపంచాయతీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మే 20 న దేశ వ్యాప్త సమ్మె తాత్కాలిక వాయిదా పడినా జూలై 9వ తేదీన కార్మిక సంఘాల నేతృత్వంలోని ప్రజాసంస్థల నుండి కార్మిక వ్యతిరేక సమ్మె తుఫాను నాలుగు లేబర్ కోడ్స్ ను ముంచెత్తుతుందని, పాలకవర్గం భయపడాలన్నారు. మరోవైపు ప్రతిపక్ష కార్మిక సంఘాల తుఫానును అణచివేయడానికి మోడీ శ్రామిక ప్రజలపై అన్ని రకాల చిట్కాలను జోడిస్తున్నాడని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు అందరూ బానిసలుగా మారిపోతారని అన్నారు. సంఘం పెట్టుకునే హక్కు పోతుందని, గత పది సంవత్సరాల నుంచి అనేక కార్మిక చట్టాలు నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. లేబర్ కోడ్ లో అత్యంత ప్రమాదకరమైంది సమ్మె చేసే హక్కును రద్దు చేయడం, సమ్మె చేస్తే చట్ట వ్యతిరేకం అవుతుందని, కార్మికుల ఒక రోజు సమ్మెకు 8 రోజుల జీతం కోత విధిస్తారని తెలిపారు.లేబర్ కోడ్స్ ద్వారా యజమానులపై కార్మిక చట్టాల్లో ఉన్న, క్రిమినల్ చట్టాల్లో ఉన్న 180 రకాల శిక్షలు ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం 'జనవిశ్వాస్' అనే చట్టం చేసిందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనిఖీలు పద్ధతిని ఎత్తివేసాయని, కంపెనీలు మూసివేయడం, లాకౌట్ చేయడం, లే ఆఫ్ చేయడానికి పార్లమెంట్ లోనే చట్టాలు మార్చాలి. కానీ లేబర్ కోడ్స్ ద్వారా రాష్ట్రాలకు ఇష్టం వచ్చినట్లు మార్చే అధికారాలు వచ్చాయి అన్నారు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరి నిరసిస్తూ కార్మికులు ఉద్యోగులు అంతా జూలై 9వ తేదీన జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ మండల సిఐటియు అధ్యక్షులు నాగశెట్టి గంగారావు, సహాయ కార్యదర్శి కానూరు తులసి అంగన్వాడి, ఆశ, ఐకెపి, తాపీ కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి జన్మోత్సవం పురస్కరించు కొని ప్రత్యేక పూజలు



**గుంతకల్లు మే 20 (ప్రజా జ్యోతి)':** కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నందు మంగళవారం ప్రసన్నాంజనేయ స్వామి జన్మోత్సవం పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాకేష్, చెన్నకేశవ స్వామి మాట్లాడుతూ ఆలయ ధర్మకర్తలు ప్రతిరోజు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా హనుమాన్ జన్మోత్సవం పురస్కరించు కొని రాయలసీమలోనే స్వామివారి పెద్ద విగ్రహం 8 అ.8ఇంచులు ఎత్తు గల రాతి కృష్ణశిల విగ్రహం 22.05.2025 గురువారం ఉదయం 8 గంటల నుండి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి విశేష పంచామృతంతో అభిషేకం నాగవల్లి దళార్చన సింధూరార్చన మరియు విశేష పుష్పాలంకరణ జరుగును కావున భక్తాదులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి అనుగ్రహాన్ని పొంది తీర్థ అన్న ప్రసాదం స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తలారి పరుశు రాముడు,శకుంతలమ్మ,నారాయణ,మురళి, మల్లికార్జున స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ టైగర్ ఎన్టీఆర్ 42 వ పుట్టినరోజు సందర్భంగా 35 మంది రక్తదానం




**గుంతకల్లు మే 20 (ప్రజా జ్యోతి):** యంగ్ టైగర్ ఎన్టీఆర్ 42 వ పుట్టినరోజు సందర్భంగా టౌన్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు పట్టణంలోని కెపిఎస్ థియేటర్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదానం శిబిరంలో 35 మంది రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నా రు.ఈ రక్తదానంలో పిపకీరప్ప,కే.తిమ్మప్ప, లెజెండ్ రంజాన్,బాబు, అశోక్,బోయ శేఖర్,చంద్ర, అంజి,సురేష్,రవి,కార్పెంటర్ బషీర్,నందకిషోర్,మైనుద్దీన్, కిషోర్, మహబూబ్ బాషా, రామాంజనేయులు,సూరి,సింహాద్రి,మనోహర్ పాల్గొన్నారు. రక్తదానం చేసిన ప్రతికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశా రు.

# ఎమ్ ఎస్ ఎల్ పాయింట్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి






**కొవ్వూరు, తాళ్లపూడి మండలం మే 20, ప్రజా జ్యోతిన్యూస్** మండల స్టాక్ పాయింట్లు వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలను , రిజిస్టరు ప్రకారం నిర్వహిస్తున్నారో? లేదో? , అదే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్ర స్థాయి పర్యటన సందర్భంలో ఖచ్చితంగా తనిఖీ చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు.మంగళవారం చాగల్లు మండలం ఉనగట్ల ఎమ్ ఎస్ ఎల్ పాయింట్ , కొవ్వూరు పట్టణ ప్రాంతంలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరు పై జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆమేరకు చాగల్లు మండలం
ఊనగట్ల గ్రామంలోనీ మండల స్టాక్ పాయింట్ నిర్వహణ విషయంలో స్టాక్ నిర్వహణా, రిజిస్టర్ల నిర్వహణ ను పరిశీలించడం జరిగిందన్నారు. స్టాక్ పాయింట్ లో ఉన్న స్టాక్ , రిజిస్టర్ ప్రకారం సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందచేయాలని ఆర్డీవో రాణి సుస్మిత ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొవ్వూరు పట్టణంలోని పలు చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్ , అక్కడ వినియోగదారులతో మాట్లాడడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును పట్ల, మోటార్ డెలివరీ యూనిట్స్ ద్వారా ఇంటి వద్దనే సరుకుల పంపిణీ పై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చెయ్యడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తనిఖీ చేసిన స్టాక్ వివరాలు తెలియ చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ, ఐ సి డి ఎస్ ద్వారా ఏం ఎస్ ఎల్ పాయింట్ లో స్టాక్ స్పోర్టెక్స్ రైస్ 19245 సంచులలో 959.328 మెట్రిక్ టన్నులు, ఫోర్టిఫైడ్ రైస్ 14.244 మెట్రిక్ టన్నులు, చక్కెర 58.494 మెట్రిక్ టన్నులు , కందిపప్పు



పిడిఎస్ , ఐసిడిఎస్ లు 11.882 మెట్రిక్ టన్నులు , పిడిఎస్ 2.427 మెట్రిక్ టన్నులు పామ్ ఆయిల్ 1049 లీటర్ ప్యాకెట్, 7219 అర లీటర్ ప్యాకెట్ లు స్టాక్ మేరకు సరిపోయినట్లు తెలిపారు. ఆమేరకు కలెక్టర్ కు నివేదిక అందచెయ్యడంజరిగిందన్నారుఈ పర్యటన లో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, చాగల్లు తహసీల్దార్ అమ్మజీ, కొవ్వూరు తహసిల్దార్ ఎమ్. దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## మహానాడు జరుగు స్థల ప్రాంగణాన్ని పరిశీలించిన టిడిపి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల రాజశేఖర్ గౌడ్ , ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల జిల్లా : బ్యూరో మే20 (ప్రజా జ్యోతి)** నంద్యాల పార్లమెంట్ మహానాడు 2025 జరుగు స్థల ప్రాంగణాన్ని నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ , జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు నాయకులతో కలిసి నంద్యాల టేక్కే మార్కెట్ యార్డ్ స్థల ప్రాంగణాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ గౌడ్ , ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు టేక్కే మార్కెట్ యాడ్ లో జరుగు పార్లమెంట్ మహానాడు ను జయప్రదం చేయాలని టిడిపి శ్రేణులకు పిలుపునివ్వడం జరిగింది . కనీవిని ఎరగని రీతిలో పార్లమెంట్ మహానాడు జరుగుతుందన్నారు దీనికి పార్లమెంట్ వైజ్ గా 7 నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొంటున్నారన్నారు .. ప్రతి ఒక నాయకుడు , కార్యకర్త ఈ మహానాడులో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## ఆడ, మగ బిడ్డలపై అసమానత చూపొద్దు : ఇందిరా

పండితవిల్లూరులో కిశోర వికాసం పై కార్యక్రమం

లింగ వివక్షత, బాలల హక్కుల పై అవగాహన



**పాలకొల్లు, మే -20, ప్రజాజ్యోతి(జిల్లా స్టాఫ్ రిపోర్టర్)న్యూస్ :** ఆడ మగ బిడ్డలపై అసమానతలు చూపవద్దని ఐసిడిఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సిడిపిఓ సిహెచ్.ఇందిరా అన్నారు. పోడూరు మండలం పండితవిల్లూరు, జిన్నూరులలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగ వివక్షత బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సిహెచ్ ఇందిరా, ఏసిడిపిఓ పి.నాగరత్నం, డీసీపీయూ( డిస్ట్రిక్ట్ చిల్డ్రన్ ప్రొడక్షన్ యూనిట్ ఆఫీసర్) మమత శ్రీ తదితరులు మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు పూజించబడతారో.. అక్కడ దేవతలు నర్తిస్తారని మహనీయుల మాటను మరవద్దని సూచించారు.సమాజంలో లింగ వివక్షత విస్తృతంగా ఉంది అన్నారు. ఆడ భ్రూణ హత్యలు, శిశు హత్యలు అధికంగా జరుగుతున్నాయి అన్నారు. ఆడ మగ అసమానతలు ఉండకూడదని వారిని సమానంగా చూసినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. బాలల హక్కులను తెలుసుకొని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కిశోర బాలికలకు విద్యాభ్యాసం అవసరమని, అక్షరాస్యత రేటును పెంచాల్సిన బాధ్యతను తల్లిదండ్రులు, సంబంధిత ఉద్యోగులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, కిషోర్ బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# అరకు మహానాడు విజయవంతం

**అనంతగిరి మే. 20 ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి జిల్లా.అరకు నియోజకవర్గం అరకు మండల కేంద్రమైన హరిత అతిథి గృహ ఆవరణలో మంగళ వారంనాడు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు విజయనగరం జోనల్ ఆర్టీసీ చైర్మన్ సివేరి దోన్ను దొర ఆధ్వర్యంలో నిర్వహించిన. అరకు మినీ మహానాడు కార్యక్రమం సభ విజయవంతం అయింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధినేత. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అరకు వ్యాలీ కేంద్రంలో మొట్టమొదటిసారిగా మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించే అదృష్టం కలగడం ఒక వరమని.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సభలో అన్నారు. అదేవిధంగా నియోజకవర్గస్థాయి నాయకులు.కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసిన నాడే అరకు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి బాటలో నడుస్తుందని. దొర కార్యకర్తలకు. నాయకులకు సూచించారు.చిన్న పెద్ద తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించాలని కోరారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు



జ్ఞాపకాలను సభలో గుర్తు చేశారు.ప్రియతమ నేత చంద్రబాబు నాయుడుకు అరకు ప్రజలు అంటే ఎంతో ఇష్టమని అరకు ను దత్తత తీసుకొని అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేశారని. సభలో గుర్తు చేశారు. సభలో పార్టీ కార్యక్రమాలు.అభివృద్ధి కార్యక్ర మలపై తీర్మానాలు చేయడంతో సభ ఆమోదించింది. అనంతరం రాష్ట్ర జి.సి.సి చైర్మన్ కిడారి శ్రావణ కుమార్ మాట్లాడుతూ అరకు నియోజకవర్గం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి బాటలో గిరిజనులు పయనించే విధంగా గిరిజన ప్రణాళిక రూపొందిస్తూ విద్య వైద్యం వ్యాపార రంగాలతోపాటు అనేక రంగాలలో గిరిజనులు ముందుండే విధం?

## కార్యకర్త పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుంతకల్లు మే 20 (ప్రజా జ్యోతి):** మంగళవారం గుత్తి పట్టణం 8వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త భీమా కుమారుడు ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈసందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ ఆనంద్ చేత కేక్ ను కట్ చేపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరించండి



**తాళ్లపూడి, మే20, ప్రజాజ్యోతి న్యూస్** తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం గోదావరి నది పరివాహక ప్రాంతాలలో గోదావరి నది నుండి సహజ సిద్ధంగా లభించే ఇసుక ద్వారా ర్యాంపు నిర్వాహకులు కోట్ల రూపాయలుదండుకుంటున్నారే తప్ప ర్యాంపుల పై వచ్చే ఆదాయంతో సమీపగ్రామాలకు కానీ, స్థానిక ప్రజలకి కానీ నయా పైసా ఉపయోగం లేదని స్థానికులుమొరపెట్టుకుంటున్నారు. తాళ్లపూడి,తాడిపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురం, బల్లిపాడు లలో ఇసుక ర్యాంపులు ఉన్నా గాని సమీప గ్రామాలకు ఎటువంటి ఉపయోగం లేదు. ఇక గ్రామంలో మౌలిక వసతులు లేవు, ఇక మండల కేంద్రమైన తాళ్లపూడి విషయానికి వస్తే సరైన ఆట స్థలం లేదు, ఒక పార్క్ లేదు, ఒక డిగ్రీ కాలేజీ లేదు, పలు ప్రాంతాలలో రోడ్ వసతి మరియు డ్రైనేజీ వసతి అంతంత మాత్రమే. గ్రామ అభివృద్ధికి వనరులను ఎలా సమకూర్చుకోవాలి అనే ఆలోచన చెయ్యాలి, ఇసుక నుండి వచ్చే ఆదాయంలో కొంత డబ్బుని గ్రామాల అభివృద్ధికి ర్యాంపు నిర్వాహకులు వినియోగిస్తే గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయ అనడానికిఏమాత్రం సందేహం లేదని అంటున్నారు. కాబట్టి ఇసుక ర్యాంపులను నిర్వహిస్తున్న రాజకీయ నాయకులుగ్రామాలకు ఏ ఏ పనుల నిమిత్తం సహాయం చేయాలో ఆలోచించుకోవాలి. అలా గ్రామ అభివృద్ధికి సహకరిస్తే ప్రజల్లో మంచి రాజకీయనాయకులుగా గుర్తింపు పొందుతారు

## అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ





**తాళ్లపూడి,మే20, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజవర్గం కాపవరం గ్రామంలో ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండి రఫీ ఉల్లాబేగ్ చేతుల మీదగా అట్టహాసం గా జరిగింది ఈ విగ్రహ ఏర్పాటుకు దాతైన రఫీ ని గ్రామస్తులు అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు పలువురు వక్తలుమాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప తనాన్ని కొనియాడారుకార్యక్రమంలో ఏఐసిసి సభ్యురాలు ఎండి. అమర్జహ బేగ్,మాజీ ఎంపీ హర్షకుమార్,మాజీ ఎంఎల్ఏ తలారి వెంకటరావు కొవ్వూరు నియోజవర్గ కోఆర్డినేటర్ ఎండి ఫసిఉల్లాబేగ్.రాజమండ్రిపార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుల్లారావు పాల్గొన్నారు బొంతాశ్యామ్,గ్రామనాయకులు,దళితనాయకులు,గ్రామస్తులు భారీ సంఖ్యలోపాల్గొన్నారు

## అధికారులకు వినతి పత్రాల అందిస్తున్న రైతు సంఘం నాయకులు




**బేతంచెర్ల: మే20(ప్రజా జ్యోతి)** సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా సచివాలయాల ముందు నిరసన కార్యక్రమాలను బేతంచెర్ల మండలంలోని బేతంచెర్ల, అంబాపురం,గూటు పల్లె,గోర్లగుట్ట,ఆర్ఎస్.రంగాపురం గ్రామాలలో రైతుల కౌలు రైతుల వ్యవసాయ కార్మికుల సమస్యలపై, గ్రామ సచివాలయాల దగ్గర నిరసన తెలిపి అధికారులు వీఆర్వో మధు , సచివాలయం అధికారులుకు వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమాలలో ఎపి.రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు, మండల కార్యదర్శి పి. రామమోహన్,మండల నాయకులు నీలి వెంకట కృష్ణారెడ్డి, పద్మావతమ్మ,డాక్టర్ గురుస్వామి,ఆలకుంట్ల మధు ,శ్రీరాములు, సి. శ్రీనివాసులు సి.లక్ష్మి దేవి,జయమ్మ,అంబాపురం మధు,జ్యోతమ్మ,శేషాద్రి,మహమ్మద్ రఫి తదితర రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు,కార్మిక చట్టాలను అమలుపరచాలి.. సిపిఎం



**ప్రజా జ్యోతి తుగ్గలి** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తక్షణమే అమలుపరచాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. మంగళవారము మండల కేంద్రమైన తుగ్గలి తహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీరం చేసే ప్రయత్నం చేస్తుందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పనికి తగ్గట్టుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికుల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మికుల చట్టాలను అమల పరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ అధ్యక్షుడు రంగస్వామి, శిఖామణి హయత్ భాష తదితరులు పాల్గొన్నారు.

## పెండేకల్లులో జూనియర్. ఎన్టీఆర్,జన్మదిన వేడుకలు



**ప్రజా జ్యోతి తుగ్గలి** మండలం పరిధిలోని పెండేకల్లు గ్రామంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమానులు కేకును కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అదేవిధంగా యువకుల ఆధ్వర్యంలో స్కూటర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సందర్భంగా గ్రామంలో కేకును కట్ చేసి జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నామన్నారు. అనంతరం గ్రామంలో యువకులు స్కూటర్ ర్యాలీ నిర్వహించి బర్త్డే కేకులను ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలి...



జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి...

**బాపట్ల మే 20 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఫోర్స్మెంట్ చర్యలు ముమ్మరం చేయాలని, అక్రమ తవ్వకాలు జరిగితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని చెప్పారు జూన్ నుండి ఇసుక తవ్వకాలపై నిషేధం అమలులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు 2021%-%2024 మధ్య అక్రమ తవ్వకాలపై ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తింపు పొందిందని చెప్పారు. జెపి వెంచర్స్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు.జువ్వలపాలెం%-%2లో కొత్త ఇసుక రేవును గుర్తించామని, అక్కడ 24.9 హెక్టార్లలో ఇసుక అందుబాటులో ఉందన్నారు. భట్టిప్రోలు, గాజులలంకలో కూడా పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు.ఈ సమావేశంలో మైన్స్ ఏడి రాజేష్, డిటిఓ పరంధామ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రాఘవేంద్ర రావు, బాపట్ల ఆర్డీవో పి. గ్లోరియా, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక లోటున్నా.. రాష్ట్ర ప్రజలకు మంచి పాలన

**యలమంచిలి మండలంలో రూ.2.04 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ఎండ, వాన, రాత్రిని సైతం లెక్కచేయని మంత్రి రామానాయుడు.. సహకరిస్తున్న నాయకులు**

**యలమంచిలి(పాలకొల్లు), మే- 20, ప్రజాజ్యోతి (స్టాఫ్ రిపోర్టర్) న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వం దోపిడీ పాలనకు రాష్ట్రంలో ఆర్థిక లోటు నెలకొన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు -మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి యలమంచిలి మండలంలో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేసి అవినీతి దోపిడి పాలనకు పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రధానంగా రైతాంగానికి అవసరమైన కాలువ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, ఈ పనులు పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. రూ.11.55 లక్షలతో యలమంచిలి లంక బ్రిడ్జి దగ్గరలో వడ్డీ లంక చానెల్ త్రవ్వ పనులు ప్రారంభం,వడ్డి లంక గ్రామంలో రూ.80.50 లక్షలతో ఎస్.సి. పేట దగ్గరలో వడ్డీ లంక చానెల్ కి సి.సి. వాల్ నిర్మాణ పనులు,లక్ష్మిపాలెం గ్రామం పరిధిలో లక్ష్మిపాలెం లాక్ దగ్గరలో బ్యాంక్ కెనాల్ కు రూ.10 లక్షలతో సి.సి. వాల్ నిర్మాణ పనులకు,లక్ష్మిపాలెం లాక్ దగ్గరలో రూ.81.41 లక్షలతో లాక్ గేట్లు నిర్మాణ పనులు,లక్ష్మిపాలెం బ్రిడ్జి దగ్గరలో రూ.19.75 లక్షలతో బ్యాంక్ కెనాల్ త్రవ్వ పనులను ప్రారంభించారు.

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి


## మండలంలో స్కీమ్ వర్కర్స్ లో రాజకీయ వేధింపులు తగదు




**నంద్యాల జల్లా: బ్యూరో మే20(ప్రజా జ్యోతి)** పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు కార్మికులను ఉద్యోగులను నయా బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణ నుండి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి సిఐటియు పట్టణ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వై ఎల్లయ్య, సంజీవ నాయుడు, సిఐటియు నాయకులు వై.బి వెంకటేశ్వర్లు, మదు శేఖర్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ఎన్నో ఏళ్లుగా సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక హక్కులను నాలుగు కోడ్ లు విభజించి పరిపాలన చేయాలని ఆలోచన చేయుచున్నది.అమ్మలు అయితే దేశవ్యాప్తంగా విద్యుత్, రవాణా, బ్యాంకుల్లో, ఇన్సూరెన్స్ లో 10 సంవత్సరాల నుండి సంస్థలను ప్రైవేటు కాకుండా విశాఖ స్టీల్ ప్రైవేట్ పరం కాకుండా కార్మికులు అడ్డుకుంటున్నారన్నారు. ప్రైవేటీకరణ వలన కార్మికులపై, ప్రజలపై మరింత భారం పడుతుందని, ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి పోతే ఆర్థిక సమానతలు మరింత పెరుగుతాయన్నారు. ప్రభుత్వం రంగాన్ని కాపాడుకునేందుకు కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. 15వ కార్మిక మహాసభ సిఫారసులు 1992 సుప్రీంకోర్టు తీర్పును పరిగణంలోకి తీసుకొని కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయని, భారత కార్మిక మహాసభ సిఫారసు అనుకూలంగా స్కిన్ వర్కర్లను వర్కర్ల గుర్తించి, కనీస వేతనాలను, సామాజిక భద్రత అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దేశంలో కాంటాక్ట్ కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, చట్టం ప్రకారం పర్మినెంట్ కార్మికులు చేసి వర్క్ పర్మిట్ కార్మిక వేతనాలు, అలవెన్సులు, బెనిఫిట్ లు ఇవ్వాలని, సుప్రీంకోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు చెప్పిందని వాడు తెలిపారు. కాంటాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ విధానం చేశారు. 175 నియోజకవర్గాలలో బేతంచర్ల మండలంలో స్కీమ్ వర్కర్స్ పై మరియు వివోఏల పై రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయని వారు తెలిపారు. ఈ నియోజకవర్గంలో ప్రజా పరిపాలన కాకుండా వ్యక్తిగత పరిపాలన జరుగుతుందని టిడిపి ప్రభుత్వ అధికారులకు వచ్చిన తర్వాత వ్యక్తిగత పరిపాలన ఎక్కువ అయ్యాయని వారు తెలిపారు. నియోజవర్గంలో స్కీమ్ వర్కర్స్ పై రాజకీయ వేధింపులు ఆపుతే భవిష్యత్తులో పార్టీలకు, పాలకులకు, అధికారం ఉంటుందని ప్రజలు తిరస్కరించి పరిపాలన చేస్తే టిడిపికి పుట్టగతులు ఉండవని వారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్, అంగన్వాడి, ఆటో వర్కర్స్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 22 న శ్రీ కిష్టాపురం కొండల్లో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం





**ప్రజా జ్యోతి తుగ్గలి** మండల కేంద్రమైన తుగ్గలి కృష్ణాపురం కొండల్లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు 22న ఘనంగా నిర్వహించినట్లు ఆంజనేయ స్వామి దేవస్థానం పూజారి వద్ద ప్రహల్లాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం నుండి పూజా కార్యక్రమాలు, 22న గురువారం ఉదయము పూజా కార్యక్రమము వద్ద వారి కుటుంబ సభ్యులచే నిర్వహించబడుతున్నట్లు వారు తెలిపారు. ఉదయము 10 గంటలకు కళషోత్సవం, సాయంత్రం మూడు గంటలకు కుంభోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, పూజారి వద్ద ప్రహల్లాద సమక్షంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంకాలము తుగ్గలి గ్రామం నందు ఊరేగింపు కార్యక్రమము, రాత్రి 8 గంటల నుండి తుగ్గలి భజన బృందం రాతన చెన్నంపల్లి భజన బృందం వారిచే జరుగుతున్నట్లు వారు తెలిపారు. మొదటి బహుమతి రు. 16,000 వద్ద రామాంజనేయులు, రెండవ బహుమతి రు. 13,000 వద్ద పెద్ద మల్లయ్య, మూడవ బహుమతి రు. 10,000 ఎన్ ఆర్ స్వామి, నాలుగవ బహుమతి రు. 8,000 ఎన్ఆర్ స్వామి, ఐదవ బహుమతి రు. 6,000 రాంబాబు, ఆరవ బహుమతి రు. 5,000 బోయ లక్ష్మీనారాయణ, ఏడవ బహుమతి రు.5,000 నాగరాజు, ఎనిమిదవ బహుమతి రు.4,000 విలేకరి చిన్నారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, తొమ్మిదవ బహుమతి రు. 3,000 ఆకుల శ్రీనివాసులు, పదవ బహుమతి రు.2,500 బ్యాంకు శీను, 11వ బహుమతి రు. 2,000 హోటల్ నాగేంద్ర,12 వ బహుమతిరు. 1,000 మంగలి రామాంజి తదితరులు బహుమతులను ఇచ్చినట్లు పూజారి వద్ద ప్రహల్లాద తెలిపారు.

# నీటిపారుదల, డ్రైనేజ్ శాఖల పనుల తనిఖీ...

**పాల్గొన్న కలెక్టర్ జె వెంకట మురళి...**

**ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వరమరాజు...**

**నల్లమడ వాగు, పీటీ ఛానల్, చెరుకూరు ట్యాంక్‌లను పరిశీలించిన కలెక్టర్...**

**పనులు వేగంగా పూర్తి చేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు...**





**బాపట్ల, మే 20 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో నీటిపారుదల మరియు డ్రైనేజీ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కూడా పాల్గొన్నారు. ముందుగా జిల్లెలమూడి సమీపంలోని నల్లమడ వాగు ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్, వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని, విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన భూములకోసం ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.బాపట్లకు నీటి సరఫరా చేసే పీటీ ఛానల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఛానల్‌లోని ఇసుకను తొలగించి, బాపట్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. నీటి సరఫరా 35 రోజుల నుండి 60 రోజుల వరకూ కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.తదుపరి నర్సాయపాలెం లోని చెరుకూరు ట్యాంక్ కాలువ వద్ద చేపట్టిన శుద్ధి పనులను ప్రారంభించారు పంచాయతీలో పేరుకుపోయిన చెత్త నిర్వహణ లోపం చూసి కలెక్టర్ పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించే విధానాన్ని అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు అనంతరం నల్లమడ వాగు లాకులను పరిశీలించిన కలెక్టర్, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీల్లో ఇరిగేషన్ ఎస్ ఈ, వెంకటరత్నం, డ్రైనేజీ శాఖ ఈ.ఈ మురళీకృష్ణ, రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, తహసీల్దార్ సలీమా తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాత పట్నంలో మినీ మహానాడు

**శ్రీకాకుళం :** తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో తన నూతన గృహం వద్ద మినీ మహానాడు కార్యక్రమం చేపట్టారు . తొలుత పార్టీ జెండా కార్యకర్తలతో కలిసి ఎగురవేశారు.అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన మరియు పూల మాల వేసి నివాళలు అర్పించారు మినీ మహానాడు సభలో భాగంగా పిల్లలుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం సభనుద్దేశించి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా వృద్ధినిచ్చింది.పార్టీకి కార్యకర్తలే బలం,కార్యకర్తలకు,ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న సంవత్సర కాలంలో 650 కోట్ల రూపాయిలతో నియోజకవర్గం అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.అలాగే నియోజకవర్గం అభివృద్ధి కోసం మనందరం కలసి కృషి చేద్దాం అని తెలియజేశారు.నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభత్వం పొంది ప్రమాదవశాత్తు మరణించినట్లాయితే ఎమ్మెల్యే సొంత నిధులనుండి మామిడి అప్పారావు గారి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50,000/- రూపాయిలు ప్రమాద బీమా ప్రకటించారు. నియోజకవర్గం స్థాయిలో కార్యకర్తలందరి సమక్షంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకం నుండి నేటి వరకు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను సన్మానించారు.నియోజకవర్గ స్థాయిలో మండలాల వారిగా పలు అభివృద్ధి కార్యకలాపాలపై తీర్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ముఖ్య నాయకులు,క్లస్టర్, యూనిట్,బూత్, కె యస్ యస్ సభ్యులు,గ్రామ కమిటీలు, మండల కమిటీలు,నియోజకవర్గ కమిటీలు, అలాగే అనుబంధ కమిటీలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆచంట మినీ మహానాడు విజయవంతం






**వేలాది సంఖ్యలో తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు**

**భారీ వర్షాన్ని సైతం లెక్కచేయని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

**మినీ మహానాడు సభతో ఆచంట పసుపుమయం**

**మహానాడుతో నాయకులు కార్యకర్తలు అభిమానుల్లో నూతన ఉత్సాహం**

**ఆచంట, మే -20, ప్రజాజ్యోతి (జిల్లా స్టాఫ్ రిపోర్టర్), న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కమ్మ సంఘం కళ్యాణమండపంలో మంగళవారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడు విజయవంతమైంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయక నలుమూలల నుంచి ప్రతి గ్రామంలోని తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో సభా ప్రాంగణానికి తరలివచ్చారు. కార్యకర్తలు, అభిమానుల రాకతో సభ సభ కిక్కిరిసింది. ప్రతి ఒక్కరి మెడలో పసుపు కండువాలు, రహదారుల కిరివైపులా జెండాలు ఏర్పాటు చేయడంతో ఆచంట పసుపుమయం అయింది. సామాన్య కార్యకర్తను మొదలుకొని వేదికను అలంకరించిన టిడిపి శ్రేణులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఆచంట ఎమ్మెల్యే, మాజీమంత్రి, పోలిట్ బ్యూరో సభ్యుడు, శాసనసభ హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్, మహానాడు సభ సారథి పితాని సత్యనారాయణ వరకు పలికిన ప్రసంగాలు తెలుగు తమ్ముళ్ల హృదయాల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగుజాతి నట కిరీటి, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్మరణతో స్ఫూర్తిదాయక ఆయన ఆశయాల సాధనకు తామంతా కట్టుబడి ఉంటామని, టిడిపి ఎప్పుడు పోటీలో ఉన్న విజయవంతానికి కృషి చేస్తామని, రాష్ట్రంలోనే ఆచంట నియోజకవర్గాన్ని ప్రప్రథమ స్థానంలో నిలుపుతామని దృఢ నిశ్చయంతో తెలుగు తమ్ముడు సభా ప్రాంగణాన్ని విడిచారు.

**బడుగు బలహీన వర్గాలకు..**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పేద, బడుగు బలహీన వర్గాలవారికి ప్రాధాన్యతను కల్పించింది. సామాన్య కార్యకర్తగా మొదలుకొని ఎమ్మెల్సీ స్థాయి వరకు పదవులను అందించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ చెప్పిన మాటలు.. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల ఇబ్బందుల్లో నా ఇంటి గుమ్మాలు ఎప్పుడూ తెరిచి ఉంటాయి, ప్రతీ కార్యకర్తకు అండగా నిలిచి, పార్టీ కోసం కష్టపడే ప్రతి నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తానన్న పెద్దన్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చివరి ప్రసంగం వరకు ప్రతి కార్యకర్త గుండెల్లో ధైర్యాన్ని నింపింది. తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలను ప్రోత్సహించి, రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులు అందించి పేద బడుగు బలహీనవర్గాల పార్టీగా సభ్యత్వ నమోదులో.. పార్టీకి అధికారం కట్టబెట్టడంలో ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచింది. సభలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన తీర్మానాలు, ప్రతి గ్రామం నుంచి నూతన కమిటీల్లో గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జిల వరకు సభా ప్రాంగణంపై స్వయంగా పితాని సత్యనారాయణ పేర్లను వెల్లడించడం, స్వయంగా పార్టీ సాలువాలు కప్పి అభినందించడం కార్యకర్తల్లో ఆనందానికి అవధులు లేవు. ఈ పండుగ వాతావరణంలో ఆచంట మినీ మహానాడు మరుపురాని అనుభూతిగా తెలుగు తమ్ముళ్లు పార్టీ శ్రేణులు మాట.

## సిద్దిపేట జిల్లాలో అడ్వాన్స్ సప్లమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగు

**27 కేంద్రాల వద్ద 163 బిఎన్ ఎస్ ఎస్ -2023 సెక్షన్ అమలు:**

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

**సిద్దిపేట :** సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ 22-05-2025 నుండి 29-05-2025 వరకు అడ్వాన్స్ సప్లమెంటరీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సిద్దిపేట్ జిల్లాలో వున్న 27 పరీక్ష కేంద్రల వద్ద 163 బిఎన్ ఎస్ ఎస్ -2023 సెక్షన్ విదించనైనది, 22-05-2025 నుండి 29-05-2025 వరకు ఉదయం 700 నుండి సాయంత్రం 7:00 వరకు అమల్లో ఉంటుంది. మరియు పరీక్షలు జరుగు సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని, మరియు పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటారని పోలీస్ అధికారులు పరిక్ష సమయంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు, మరియు పోలీస్ స్టేషన్ లో నుండి పరిక్ష పత్రం పరిక్ష కేంద్రానికి వెళ్ళే సమయంలో కానిస్టేబుల్ తప్పనిసరిగా ఎస్కార్ట్ వుండాలని, పరిక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. పరీక్షా సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కమిషనర్ సూచించారు.

## ఆరవ రోజు అదే జోరు.. కాళేశ్వరంకు పోటెత్తిన పుష్కర భక్తులు.



**జయశంకర్ భూపాలపల్లి**

కాళేశ్వర నివాసోవా,కాళేశ్వర నీరిక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం" అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. ఆరవ రోజు మంగళవారం కూడా త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోతోంది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పుణీతులై నీరాజనాలు అర్పిస్తున్నారు. 6వ రోజు కూడా భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రాదాయాలను కొనసాగించే

# పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు

**సిద్దిపేట :** పశువుల రవాణా విషయంలో వెటర్నరీ డాక్టర్ నిబంధనలు పాటించాలి నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది. 24లీ7 నిరంతర పర్యవేక్షణలో వుండేవిధంగా ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్ ల వారిగా సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పదని అన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. పశువులను రవాణాచేసే



ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు వాలిడ్ డాక్యుమెంట్స్, ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుండి రవాణా అయ్యే పశువుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అదేవిధంగా మతపెద్దలతో శాంతి సమీక్షా సమావేశాలు నిర్వహించి, భద్రతా పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అదేవిధంగా అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా వుంటుందని, చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ సీజ్ చేస్తామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్పోస్ట్ వివరాలు: రంగదాంపల్లి ఎక్స్ రోడ్, సిద్దిపేట రూరల్ పిఎస్ చౌరస్తా, అనంతసాగర్, అక్బర్ పేట ఎక్స్ రోడ్, అనభేరి చెక్పోస్ట్ హుస్నాబాద్, గుర్జకుంట క్రాస్ రోడ్, వంటిమామిడి చౌరస్తా.

## డేంజర్‌జోన్‌లోని ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**జెన్కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి**

**తాడిచర్లలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**

**మంథని :** ప్రస్తుతం మానవ జీవన శైలిలో వస్తున్న మార్పుల వలన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాడిచర్ల కాపురం గ్రామాల జెన్కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి అన్నారు. బుధవారం తాడిచెర్ల కాపురం గ్రామాల జెన్కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ పాత గ్రామపంచాయతీ ఆవరణంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. బ్లాస్టింగ్ జోన్ దగ్గరగా ఉండి డేంజర్ జోన్ లో నివసిస్తున్న గ్రామస్తులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు ఈ శిబిరంలో 150 మందికి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోలేటి శ్రీనివాస్, ఇందారపు ప్రవీణ్ , ఇందారపు సరీన్, తాండ్ర మార్కు, ఆర్ని ఉదయ్, రామిడి రాజసమయ్య, రామిడి శ్రీకాంత్ , దేవర రమేష్, బీర్నేని దుర్గాప్రసాద్ , ఖమ్మంపల్లి పర్వతాలు , మెరుగు ఆగయ్య , గట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్ భవన్ చోరీ కేసులో ట్విస్టు

**హైదరాబాద్ :** రాజ్‌భవన్ చోరీ కేసులో మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఈనెల 14వ తేదీన రాజ్ భవన్‌లోకి హెల్మెంట్ ధరించి వచ్చిన వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. నాలుగు హార్డ్ డిస్క్ లను చోరీ చేశాడు. రాజ్ భవన్ అధికారులు ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్ శ్రీనివాస్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి అతన్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే, గతంలోనూ ఇతన్ని పోలీసులు అరెస్టు చేశారు.రాజ్ భవన్ లో పనిచేసే తోటి మహిళా ఉద్యోగిని ఫొటోలు మార్ఫింగ్ చేసి శ్రీనివాస్ భయభ్రాంతులకు గురిచేశాడు. తనకేమీ తెలియనట్లుగా ఎవరో నాకు ఈ ఫొటోలు పంపిస్తున్నాడు జాగ్రత్త అని చెప్పాడు. దీంతో కలవరానికి గురైన మహిళా ఉద్యోగిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఆ మార్ఫింగ్ ఫొటోలను శ్రీనివాసే పంపించాడని పోలీసులు గుర్తించారు. దీంతో అతన్ని అరెస్టు చేసి వారం కిందట రిమాండ్ కు పంపారు. ఈ ఘటన తరువాత రాజ్ భవన్ అధికారులు శ్రీనివాస్ ను సస్పెండ్ చేశారు. జైలుకెళ్లిన శ్రీనివాస్ రెండు రోజుల తరువాత బెయిల్ పై విడుదలయ్యాడు.

**హార్డ్ డిస్క్ ల కోసం..**

జైలు నుంచి బయటకు వచ్చిన శ్రీనివాస్ రాత్రి సమయంలో సెక్యూరిటీని మభ్యపెట్టి రాజ్ భవన్ లోపలికి వెళ్లాడు. తన కంప్యూటర్ లో ఉన్న హార్డ్ డిస్క్ ను చోరీ చేసుకొని వెళ్లిపోయాడు. ఈ ఘటనపై రాజ్ భవన్ అధికారులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. శ్రీనివాస్ చోరీ చేసినట్లు గుర్తించారు. అతనిని అరెస్ట్ చేసి హార్డ్ డిస్క్ లను స్వాధీనం చేసుకున్నారు. ఆ హార్డ్ డిస్క్‌లో మహిళకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు ఉండటంతో ఆ సాక్ష్యాలను డిలీట్ చేసే ప్రయత్నంలో చోరీకి పాల్పడినట్లు తెలిసింది. ప్రస్తుతం శ్రీనివాస్ రెండోసారి జైలుకు వెళ్లాడు.

## సిరాజ్ కుట్రపై పోలీసుల ఆశ్చర్యం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో బాంబు పేలుళ్ల కోసం సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల సాయంతో తెలుగు రాష్ట్రాల యువకులు సయ్యద్ సమీర్, సిరాజ్ ఉర్ రెహ్మాన్ పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని వారాసిగూడకు చెందిన సయ్యద్ సమీర్, ఆంధ్రప్రదేశ్ విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను పోలీసులు విచారించి కీలక వివరాలు రాబట్టారుతెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలో నిందితులు పేలుళ్లకు కుట్ర పన్నారు. ఆరుగురు సభ్యులతో సమీర్ ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. అల్- హింద్ ఇత్తేహదుల్ ముసల్మాన్ పేరుతో గ్రూపులు ఏర్పాటు చేసుకున్నాడు. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.సిరాజ్ తండ్రి విజయనగరంలోని రూరల్ స్టేషన్‌లో ఏఎస్సై, అతడి తమ్ముడు ఎస్డీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో సిరాజ్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఎస్సై సెలక్షన్స్ కోసం హైదరాబాద్‌కు శిక్షణ కోసం వచ్చాడు.రెండుసార్లు ఎస్సై ఉద్యోగం కోసం ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. గ్రూప్-1 కోసం శిక్షణ తీసుకుని రెండుసార్లు ప్రయత్నం చేసినా సెలెక్ట్ కాలేదు. 2024 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు 108లో టెలికాలర్‌గా పనిచేశాడు. హైదరాబాద్‌లో ఉండగా సయ్యద్ సమీర్‌తో అతడికి పరిచయం ఏర్పడింది. సమీర్ ద్వారా వరంగల్‌కు చెందిన పరహాన్ మొయినుద్దీన్, ఉత్తరప్రదేశ్ కు చెందిన బాదర్ తో పరిచయాలు ఏర్పడ్డాయి.ముస్లింలపై జరుగుతున్న అన్యాయాలపై సామాజిక మాధ్యమాల్లో చర్చించుకునేవారు. గత ఏడాది నవంబర్ 22న ముంబైకి వెళ్లి ఓ పదిమందిని కలిశారు సమీర్, సిరాజ్. అద్నాన్ ఖురేషి, దిల్షాన్, మొహిషిన్ షేక్, జహీర్ అలియాస్ అమన్ కలిసి ఓ లైవ్ షోకి హాజరయ్యారు. షహబాజ్, జీషన్ అనే వ్యక్తులతో పాటు తదితరులను కలిసేందుకు జనవరి 26న సమీర్ ఢిల్లీ వెళ్లాడు.షహబాజ్ విదేశాలకు వెళ్లిపోయాడని తెలిసి మరుసటి రోజు సల్మాన్, సిరాజ్ మండూలికి వెళ్లారు. సౌదీలో ఉంటున్న అబూ ముసబ్ సూచనల మేరకు సిగ్నల్ యాప్ లో తరచూ చర్చలు జరిపారు. రసాయన పదార్థాలు ఉపయోగించి ఐఈడీలు తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి పేలుడు పదార్థాల ముడిసరులను తెప్పించాడు సిరాజ్.జిహాదీ చర్యల్లో భాగంగా అవసరమైతే ప్రాణత్యాగం చేయాలని సిరాజ్, సమీర్ నిర్ణయం తీసుకున్నారు. ఒమన్‌లో ఉంటున్న హైదరాబాద్‌కు చెందిన ఇమ్రాన్ అక్రమ్ ద్వారా కొనుగోలు చేసిన పేలుడు పదార్థాలతో ఐఈడీ తయారు చేసి, జనసంచారం ఎక్కువ ఉన్న ప్రదేశంలో పేల్చాలని వారికి ఆదేశాలు వచ్చాయి. బాంబులు తయారైన తర్వాత మొదట డమ్మీ బ్లాస్ట్ చేయాలని ఆదేశాలు అందాయి. ఐఈడీలను పేల్చి వీలైనంత ఎక్కువ మందిని చంపాలని వారిని ఇమ్రాన్ ఆదేశించాడు.

## భూ భారతి అమలు చేయడం కోసం జూన్ 2 అన్ని గ్రామాల్లో ఉన్న


**సమస్యలు పరిష్కారం చేయడం కోసం ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హుస్నాబాద్ :** ఆగస్టు 15 లోపు వీలైనంత వరకు జటిలమైన శాశ్వత సమస్యలను పరిష్కారం చేయడానికి భూ భారతి చట్టం ఉపయోగపడుతుంది.6 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను ఈనెల 27 వ తేదీ ఫైనల్ చేస్తాం 3 నెలల వారికి శిక్షణ ఇచ్చి ప్రతి మండలానికి 8 మంది తగ్గకుండా సర్వేయర్లను ఏర్పాటు చేస్తాం.మొదటి దశ ఇందిరమ్మ ఇళ్లు 4 లక్షల 50 వేలు ఇప్పటికే ప్రకటించాం ఈ నెలాఖరులోపు లబ్ధిదారులను ప్రకటిస్తాం.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9872 మంది చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నాము.ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతో అదనంగా అక్కడే ఉండే గిరిజనుల సంఖ్యను బట్టి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుంది.

## హైదరాబాద్ నగరంలో మరో అగ్నిప్రమాదం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరం లో మరో అగ్నిప్రమాదం జరిగింది. నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో దట్టంగా పొగ కమ్ముకుంది. మంటలు చెలరేగడంతో భవనంలోని నివాసితులు వెంటనే కిందకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబంలోని 17మంది ప్రాణాలు కోల్పోయారు.

# జీవన శైలితో పొంచి ఉన్న ముప్పు..



చెడు జీవనశైలి కారణంగా.. దేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. దీనిని ఇప్పుడు ఆపకపోతే రానున్న రెండు దశాబ్దాలలో దేశ పౌరులలో మూడింట ఒక వంతు మంది ఈ వ్యాధికి బలైపోవచ్చు. ఇది కేవలం ఒక వ్యాధి మాత్రమే కాదు.. అనేక వ్యాధులకు తల్లి కూడా. నిపుణులు ఈ వ్యాధిని సునామీ లాంటిదని అభివర్ణించారు. ఈ వ్యాధిని ఇప్పుడే నియంత్రించకపోతే.. భవిష్యత్తులో దేశ ఆరోగ్య నిర్మాణం, ఆర్థిక ఉత్పాదకత తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో ఒక వ్యాధి చాలా వేగంగా వ్యాపిస్తోంది. మారిన జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. పిల్లలు కూడా దీనికి బలైపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా అనేక ఇతర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ వ్యాధి సునామీగా మారి రాబోయే 25 సంవత్సరాలలో భారతదేశాన్ని తాకవచ్చు. భారతదేశంలో నివసిస్తున్న 35 శాతం కంటే ఎక్కువ మంది ఈ వ్యాధికి బలైపోయే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఏమిటి? ఇది ఎందుకు అంత వేగంగా వ్యాపిస్తోంది? ఈ వ్యాధి అనేక ఇతర వ్యాధులకు మూలకారణంగా చెప్పబడింది. ఈ వ్యాధి టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం, హార్మోన్ల రుగ్మతలు, పిల్లలను కనలేకపోవడం, కొన్ని క్యాన్సర్లు వంటి వ్యాధుల పెరుగుదలకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. ఈ వ్యాధి దేశంలో ఒక సంక్షోభంగా మారుతోంది. ఈ వ్యాధికి ప్రధాన కారణం చెడు జీవనశైలి, మారిన దినచర్య, ఆహారపు అలవాట్లు. ఈ వ్యాధి పిల్లలను కూడా ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధిని స్థూలకాయం అంటారు. ది లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. 2050 నాటికి భారతదేశ జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు మంది లేదా 449 మిలియన్ల మంది ఊబకాయంతో బాధపడే అవకాశం ఉంది. ఌ××మీ లోని మెడిసిన్ విభాగంలో అదనపు ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ ప్రకారం 20 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారిలో అంటువ్యాధులు కాని వ్యాధుల పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. దీనికి ప్రధాన కారణం స్థూలకాయం. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు.. డీన్ డాక్టర్ రాజేష్ ఉపాధ్యాయ్ ప్రకారం ఊబకాయ సమస్యని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఇది దేశ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, ఆర్థిక ఉత్పాదకతపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. అంటువ్యాధిలా పెరుగుతున్న ఈ ఊబకాయం వ్యాధిని ఆపడానికి పెద్ద ఎత్తున ప్రణాళికలను రచించాలి.. ఊబకాయం గురించి ప్రజలను అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ వ్యాధి జీవనశైలికి నేరుగా సంబంధించినది. చిన్న వయసులోనే పిల్లలు దీని బాధితులుగా మారుతున్నారు. దీనిని నివారించడానికి, పాఠశాలల నుండే అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు జరగాలి. పిల్లలకు ఏది మంచిదో, ఏది చెడ్డదో వారి ఆరోగ్యానికి చెప్పాలి. ఇది మాత్రమే కాదు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాల్సిన అవసరం కూడా ఉంది. ఇప్పటి నుండే దీని కోసం ప్రయత్నాలు చేయకపోతే, రెండు దశాబ్దాల తర్వాత దేశ ఆరోగ్యం పూర్తిగా క్షీణించవచ్చు.

# మలబద్ధకంతో ఇబ్బందిపడుతున్నారా



ప్రస్తుతం చాలా మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మలబద్ధకం ప్రజలను ఇబ్బంది పెడుతుంది. ఒకసారి మలబద్ధకం బారిన పడితే అది ఎక్కువ కాలం తగ్గదు. మలబద్ధకం విషయంలో.. కొన్ని ఆయుర్వేద మందులను తీసుకోవచ్చు. వీటిని ఉపయోగించడం వలన మలబద్ధక సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం ఎక్కువ మంది ప్రజలు చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మలబద్ధకంతో బాధపడుతున్నారు. కడుపు శుభ్రం కాకపోతే రోజంతా నీరసం, సోమరితనం, చిరాకు ఉంటాయి. మలబద్ధకం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. దీనితో మలబద్ధకంతో బాధపడేవారు తరచుగా వైద్య చికిత్స తీసుకుంటున్నారు. మందు తీసుకున్న సమయంలో ఈ సమస్య కొంతవరకు తగ్గుతుంది. మందులు ఆపివేసినప్పుడు మళ్ళీ మొదలవుతుంది. అయితే ఈ మలబద్ధకం సమస్యకు బెస్ట్ సొల్యూషన్ ఆయుర్వేదం అని నిపుణులు చెబుతున్నారు. ఎవరైనా మలబద్ధకంతో బాధపడుతుంటే ఈ ఆయుర్వేద మందులు తీసుకోవచ్చు. మలబద్ధకం ఒక తీవ్రమైన సమస్య. అయితే ఎక్కువ మందికి ఈ సమస్య తప్పుడు ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా వస్తుంది. ఆలస్యంగా నిద్రపోవడం, ఆలస్యంగా మేల్కొనడం ఈ సమస్యకు మూల కారణం. మలబద్ధకంలో అనేక రకాలు ఉన్నాయి. సాధారణంగా మనకు దానిలో ఒక రకం మాత్రమే తెలుసు. టాయిలెట్ నుంచి వచ్చిన తర్వాత కూడా కడుపు శుభ్రంగా లేదు. ఒకటి కంటే ఎక్కువసార్లు ఫ్రెష్ అప్ అవ్వాల్సి ఉన్నా.. టాయిలెట్‌లో ఎక్కువ సమయం గడపడం కూడా మలబద్ధకానికి సంకేతం. ఇలాంటి ఆరోగ్య సమస్యకు చక్కటి పరిష్కరం ఆయుర్వేద మేదిసిన్స్. అవి మలబద్దకం సమస్యకు చక్కటి ఉపశమనం కలిగిస్తాయి. ఎలాంటి మలబద్ధకం నుంచి అయినా ఉపశమనం పొందడానికైనా ఆయుర్వేద మందులను తీసుకోవచ్చు. వీటిలో త్రిఫల, ఇసబ్‌గోల్, అలోవెరా జ్యూస్, అభయారిష్ట కూడా ఉన్నాయి. త్రిఫల చూర్ణంని ఉసిరి, కరక్కాయ, తానికాయల వంటి మూలికల మిశ్రమం. ఇసబ్‌గోల్ ఒక సహజ ఫైబర్ మూలం. ఇది జీర్ణ ప్రక్రియ సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది. కలబంద రసంలో ఫైబర్, ఎంజైములు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అభయారిష్ట దీర్ఘకాలిక మలబద్ధకం చికిత్సకు ఉపయోగిస్తారు. రాత్రి సమయంలో ఒక చెంచా త్రిఫల పొడిని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవడం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. ఇసాబ్‌గోల్‌ను రాత్రిపూట గోరువెచ్చని నీరు లేదా పాలతో కలిపి ఒకటి లేదా అర టీస్పూన్ కూడా తీసుకోవచ్చు. ఉదయం పరగడుపున కలబంద రసం తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. అభ్యరిష్టను డాక్టర్ సలహా మేరకు తీసుకోవాలి. దీనితో పాటు, క్యారెట్, బీట్‌రూట్, సొరకాయ, దానిమ్మ , ఆపిల్ మిశ్రమ రసం తాగడం వల్ల కూడా మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. దీన్ని రోజులో ఎప్పుడైనా తీసుకోవచ్చు, అయితే ఉదయం తీసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.



# పైనాపిల్ తినొచ్చా?

వేసవిలో చాలా మంది పండ్ల రసం తయారు చేసుకుని తాగుతుంటారు. కానీ ఈ సీజన్‌లో పైనాపిల్ జ్యూస్ తయారు చేసి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదా? కాదా? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పైనాపిల్ మంచిదనే అంటున్నారు. రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో చాలా మంది పండ్ల రసం తయారు చేసుకుని తాగుతుంటారు. కానీ ఈ సీజన్‌లో పైనాపిల్ జ్యూస్ తయారు చేసి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదా? కాదా? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పైనాపిల్ మంచిదనే అంటున్నారు. ఇందులో విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్, పొటాషియం, ఫోలేట్, ఫైబర్ వంటి ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలు ఉంటాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. పైనాపిల్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది తీవ్రమైన, ప్రాణాంతక గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. పైనాపిల్‌లో ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియను మెరుగుపరుస్తాయి. దీని వినియోగం ఆకలిని తగ్గిస్తుంది. అజీర్ణంతో సహా అనేక కడుపు సంబంధిత సమస్యలను తొలగిస్తుంది. ఈ రోజుల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను అధికంగా ఉపయోగించే వారి సంఖ్య చాలా ఎక్కువ. దీని వాడకం వల్ల కంటి సమస్యలు కూడా వస్తున్నాయి. అందువల్ల కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పైనాపిల్ తినడం మంచిది. ఇందులో విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి. పైనాపిల్‌లో మాంగనీస్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అందువల్ల ఈ పండు తినడం వల్ల ఎముకలు బలపడతాయి.

# గుండె సంబంధిత సమస్యలకు ఇది మస్తు పనిచేస్తుందట..!



మనలో చాలా మంది తినే ఆహారం ఆరోగ్యానికి మంచిదో కాదో ఆలోచించకుండా తింటున్నాం. ముఖ్యంగా కొలెస్ట్రాల్ సమస్య ఉన్న వాళ్లు తినే ప్రతిదీ శరీరం పై ప్రభావం చూపిస్తుంది. కొన్ని సహజ పదార్థాలు దీన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వాటిలో వెల్లుల్లి ఒకటి. ఆయుర్వేదం ప్రకారం వెల్లుల్లి శరీరాన్ని శుద్ధి చేస్తుంది. ఇది సహజ వైద్యంలో ముఖ్యమైనది. దీనిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో బాగా పని చేస్తాయి. అల్లిసిన్, అజోయిన్, డయల్ సల్ఫైడ్ వంటి పదార్థాలు గుండె సంబంధిత సమస్యలు తగ్గించడంలో సహాయపడతాయి. రోజూ వెల్లుల్లిని తింటే కొలెస్ట్రాల్ స్థాయిలు బ్యాలెన్స్ గా ఉంటాయి. అనారోగ్యకరమైన ఆహారం, తక్కువ శారీరక చలనంతో ఈ రోజుల్లో జీవనశైలి మారిపోయింది. ఈ మార్పులు శరీరంలోని కొవ్వు పెరగడానికి కారణం అవుతున్నాయి. దాంతో పాటు గుండెపోటు, రక్తనాళాల్లో అడ్డంకులు, ఎక్కువ రక్తపోటు వంటి సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యలను తగ్గించడానికి సహజంగా దొరికే వాటిలో వెల్లుల్లి ముఖ్యమైనది. వెల్లుల్లిని పాలలో మరిగించి తింటే మంచి ఫలితం ఉంటుంది. పాలు వేడిగా ఉన్నప్పుడు దానిలో వెల్లుల్లి ముక్కలు వేసి కాసేపు మరిగించాలి. ఇలా తయారైన మిశ్రమం రాత్రి లేదా ఉదయం తినవచ్చు. ఇది శరీరంలో కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్, బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. నెయ్యిలో వేయించి తీసుకోవడం.. ఇది పూర్వ కాలంలో ఎక్కువగా ఉపయోగించబడిన పద్ధతి. నెయ్యిలో వెల్లుల్లిని వేయించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. వాసన కూడా తగ్గుతుంది. మీరు కూరల్లో వాడినా.. తినే ముందు ఒకటి రెండు ముక్కలు తీసుకున్నా మంచిదే. కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి తీసుకోవాలంటే భయపడుతారు. కానీ నెయ్యిని చిన్న పరిమాణంలో వాడితే ఉపయోగమే ఉంటుంది. ఉదయం లేచిన వెంటనే ఒక వెల్లుల్లి రెబ్బను నానబెట్టిన గోరువెచ్చని నీటితో తినడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఇది జీర్ణక్రియ బాగా జరిగేందుకు సహాయపడుతుంది. శరీరం తేలికగా ఉండేలా చేస్తుంది. అయితే ఇది తిన్న తర్వాత కాసేపు నీళ్లు తాగకపోతే మంచిది. పుల్లటి సమస్య ఉంటే ఖాళీ కడుపుతో తినడం కంటే పాలలో మరిగించి తినడం మంచిది. ఎండాకాలంలో వెల్లుల్లి శరీరానికి వేడి చేస్తుంది. అందుకే తక్కువగా మాత్రమే తీసుకోవాలి. నెయ్యిలో వేయించిన వెల్లుల్లి తినడం వల్ల కొన్ని మందుల ప్రభావం మారే అవకాశం ఉంటే డాక్టర్‌ను అడగాలి. ఒకేసారి ఎక్కువగా తినవద్దు. తక్కువగా తినాలి. వెల్లుల్లి సహజంగా దొరికే మధురమైన ఔషధం. దీన్ని తినే విధానం శరీర పరిస్థితి, కాలం, అవసరాన్ని బట్టి మార్చాలి. పాలలో మరిగించినా, నెయ్యిలో వేయించినా, ఖాళీ కడుపుతో తిన్నా మోతాదు అనుసరించాలి.

# జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే!



ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్‌ఌ, జ, జు, దీ లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి.మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది.మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ జ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

## బిజినెస్

### భారీగా తగ్గిన బంగారం ధరలు



ఏప్రిల్ 22న లక్ష మార్కు దాటేసిన బంగారం ఆ తర్వాత ఆ దూకుడు కొనసాగించలేదు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ మధ్యలో ఒకటి రెండు సార్లు మాత్రమే పసిడి ధర స్వలంగా పెరిగింది. ఓవరాల్‌గా ఈ నెల రోజుల్లోనే 7 వేల రూపాయల రేటు తగ్గినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. బంగారం ధర భారీగా తగ్గింది. గత నెల తులం బంగారం లక్షదాటేసింది. అయితే చూస్తుండగానే బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. స్టాక్‌మార్కెట్ల జోరుతో దిగివవస్తోంది బంగారం ధర. ఆల్‌టైమ్ హై నుంచి దాదాపు 7వేల రూపాయల మేర పసిడి ధర తగ్గింది. ఏప్రిల్ 22న లక్ష మార్కు దాటేసిన బంగారం ఆ తర్వాత ఆ దూకుడు కొనసాగించలేదు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ మధ్యలో ఒకటి రెండు సార్లు మాత్రమే పసిడి ధర స్వలంగా పెరిగింది. ఓవరాల్‌గా ఈ నెల రోజుల్లోనే 7 వేల రూపాయల రేటు తగ్గినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. బంగారం ధర భారీగా తగ్గింది. మంగళవారం తులం బంగారంపై రూ.500 మేర ధర తగ్గింది. 22 క్యారెట్ల బంగారం పదిగ్రాములపై రూ.450, 24 క్యారెట్లపై రూ.490 మేర ధర తగ్గింది. వెండి కిలోపై రూ.1000 మేర ధర తగ్గింది. హైదరాబాద్ 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,020గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 87,100లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.1,08,000లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 87,100, 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,020 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,08,000లుగా ఉంది.ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.87,250, 24 క్యారెట్ల ధర రూ.95,170 గా ఉంది.ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.87,100, 24 క్యారెట్ల ధర రూ.95,020 గా ఉంది.చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.87,100, 24 క్యారెట్ల రేటు రూ.95,020 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.87,100, 24 క్యారెట్ల ధర రూ.95,020 గా ఉంది.

### విదేశీ కంపెనీలపై పారాహుషార్




దొడ్డి దారిన భారత కంపెనీలను చేజిక్కించుకునే విదేశీ కంపెనీలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలనూ సమీక్షిస్తున్నట్లు సమాచారం. దాదాపు తుది దశకు చేరిన కొత్త నిబంధనలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని భావిస్తున్నారు. చైనాతో సహా భారత్‌తో భూ, సముద్ర సరిహద్దులు ఉన్న దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. ఈ కంపెనీలు భారత్‌లో సొంత కంపెనీలు పెట్టాలన్నా లేదా స్థానిక సంస్థలతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా చైనాకు చెందిన కొన్ని కంపెనీలు దొడ్డి దారిన దేశీయ కంపెనీల ముసుగులో భారత్‌లో తమ సొంత వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. కొత్త నిబంధనలతో దేశంలోని విదేశీ కంపెనీలు తమ వాటాలు బదిలీ చేయాలన్నా ప్రభుత్వ ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయబోతున్నారు.

# రైల్వే ప్రయాణికులకు ఇకపై ఆ సౌకర్యం లేదు



రైలు ప్రయాణాల్లో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా స్లీపర్ ఏసీ క్లాసుల్లో ప్రయాణించే వారికి రైల్వే శాఖ తీసుకువచ్చిన నూతన నిబంధనలు ప్రయాణ అనుభవాన్ని పూర్తిగా మార్చివేయనున్నాయి. వెయిట్‌లిస్ట్ టిక్కెట్లు కలిగిన వారికి ఇకపై రిజర్వేషన్ బోగీల్లో ప్రవేశం లేదని తేల్చి చెప్పింది. ఈ సంచలన నిర్ణయంతో పాటు, రిజర్వేషన్ గడువు తగ్గింపు, ఆన్‌లైన్ బుకింగ్‌లో ఓటీపీ విధానం వంటి మరిన్ని మార్పులు అమల్లోకి రానున్నాయి. ఈ నూతన నిబంధనలు ఏమిటి? భారతీయ రైల్వే ప్రయాణికులకు ముఖ్యంగా స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించే వారికి ఇది గమనించదగ్గ విషయం. మే 1, 2025 నుంచి రైల్వే శాఖ ప్రవేశపెట్టిన నూతన నిబంధనల ప్రకారం, ఇకపై వెయిట్‌లిస్ట్ కలిగిన టిక్కెట్లతో స్లీపర్ లేదా ఏసీ బోగీల్లో ప్రయాణించేందుకు అనుమతి లేదు. ఈ నిర్ణయం రైళ్లలో పెరుగుతున్న రద్దీని నియంత్రించేందుకు మరియు కన్ఫర్మ్ టిక్కెట్లు కలిగిన ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతకుముందు వెయిట్‌లిస్ట్ టిక్కెట్లు కలిగిన కొందరు ప్రయాణికులు రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించేందుకు ప్రయత్నించేవారు. అయితే, కొత్త నిబంధనల ప్రకారం ఆ అవకాశం ఇకపై ఉండదు. ఆన్‌లైన్ లేదా కౌంటర్ ద్వారా పొందిన వెయిట్‌లిస్ట్ టిక్కెట్లు కేవలం జనరల్ (రిజర్వేషన్ లేని) బోగీల్లో ప్రయాణించడానికి మాత్రమే అనుమతించబడతాయి. ఒకవేళ ఎవరైనా ప్రయాణికుడు వెయిట్‌లిస్ట్ టిక్కెట్‌తో స్లీపర్ లేదా ఏసీ బోగీలో ప్రయాణిస్తూ పట్టుబడితే, వారికి భారీ జరిమానా విధించబడుతుంది. స్లీపర్ క్లాస్‌లో అయితే రూ. 250 వరకు, ఏసీ క్లాస్‌లో అయితే రూ. 440 వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, వారు ఎక్కిన స్టేషన్ నుంచి తర్వాతి స్టేషన్ వరకు ఛార్జీ కూడా వసూలు చేసే అవకాశం ఉంది. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని టిక్కెట్ తనిఖీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయబడ్డాయి. వెయిట్‌లిస్ట్ టిక్కెట్లతో రిజర్వేషన్ బోగీల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తే వారిని రైలు దింపేసే అధికారం కూడా వారికి ఉంటుంది. రైల్వే శాఖ కేవలం ప్రయాణ నియమాల్లోనే కాకుండా, టిక్కెట్ల రిజర్వేషన్ ప్రక్రియలో కూడా మార్పులు చేసింది. ఇకపై ప్రయాణానికి 120 రోజుల ముందు కాకుండా, కేవలం 60 రోజుల ముందు మాత్రమే రిజర్వేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. టిక్కెట్ల బ్లాకింగ్‌ను నివారించేందుకు మరియు నిజమైన ప్రయాణికు లకు టిక్కెట్లు అందుబాటులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ టిక్కెట్ల బుకింగ్‌లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు రైల్వే శాఖ ఓటీపీ (వన్-టైమ్ పాస్‌వర్డ్) విధానాన్ని తప్పనిసరి చేసింది. ఇకపై ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే ప్రతి ఒక్కరూ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీ పీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది వినియోగదారుల ఖా తాలను అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధిస్తుంది.

# సుప్రీంలో టెల్కోలకు చుక్కెదురు



దేశంలోని టెలికాం కంపెనీల (టెల్కో)కు సుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురైంది. తమ సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్)పై చెల్లించాల్సిన బకాయిల నుంచి మినహాయింపు ఇప్పించాలన్న వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయ స్థానం తోసిపుచ్చింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీఆర్ బకాయిలపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును టెల్కోలు పొరపాటుగా అర్థం చేసుకున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఈ పిటిషన్లు చూస్తుంటే ఆందోళన, ఆశ్చర్యం కలుగుతోంది. ఒక బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ) ఇలాంటి పిటిషన్ దాఖలు చేస్తుందని ఊహించలేం. ఈ పిటిషన్‌ను మేము డిస్మిస్ చేస్తున్నాం' అని వొడాఫోన్ ఐడియాకు సుతిమెత్తగా చీవాట్లు పెట్టింది. అయితే ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న టెల్కోలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే తాము అడ్డురామని వొడాఫోన్ కంపెనీ తరఫున వాదించిన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గికి ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ఆదుకోవాలని ఉన్నా ఏజీఆర్ బకాయిలపై 2021 జూలైలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అందుకు అడ్డంకిగా ఉందని రోహత్గి ధర్మాసనానికి చెప్పారు. దాంతో ధర్మాసనం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వం వొడాఫోన్ ఐడియాను ఆదుకునేందుకు కొత్త చర్యలు ఏమైనా తీసుకునే అవకాశం ఉందనే ఆశలు చిగురిస్తున్నాయి.

# ఆర్సీబీ, సన్‌రైజర్స్ మ్యాచ్ వేదిక మార్పు

## స్పోర్ట్స్

ప్లే ఆఫ్స్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కు పెద్ద షాక్. మే 23న చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్‌ను బీసీసీఐ లక్నోకు తరలించింది. ఆతిథ్య రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఆ రోజు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడాల్సింది. అయితే.. వరుణుడి ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. దాంతో, బెంగళూరు అభిమానులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. 'అయ్యో.. సొంతగడ్డపై తమ జట్టు ఆటను చూడాలేకపోతున్నా'మని వాపోతున్నారు. షెడ్యూల్ ప్రకారం మే 23న ఆర్సీబీ, ఆరెంజ్ ఆర్మీ జట్లు చిన్నస్వామిలో తలపడాల్సింది. ఇప్పటికే బెంగళూరు అభిమానులు టికెట్లు కొనుకున్నారు కూడా. అయితే.. ఐపీఎల్ పునరుద్ధరణ తర్వాత మే 17న జరిగాల్సిన తొలి మ్యాచ్ రద్దు అయిన విషయం తెలిసిందే. వర్షం కారణంగా టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు రిఫరీలు తెలిపారు. దాంతో, ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ దిగాలుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. కాబట్టి.. లీగ్ దశలో మరొక మ్యాచ్ వర్షార్పణం కావొద్దనే ఉద్దేశంతో బీసీసీఐ లక్నోలోని అటల్ బిహార్ వాజ్‌పేయి మైదానంను ఎంపిక చేసింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్ చేరుకున్న రజత్ పాటిదార్ బృందం.. విజయంతో నాకౌట్ పోరుకు వెళ్లాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు.. అభిషేక్ శర్మ(59) మెరుపులతో పంత్ సేనకు షాకిచ్చిన ఆరెంజ్ ఆర్మీ.. ఈసారి ఆర్సీబీకి చెక్ పెట్టాలని వ్యూహాలు పన్నుతోంది. .




### ఫైనల్ అహ్మదాబాద్‌లోనే

ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ వేదికపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. కొత్త షెడ్యూల్ ప్రకారం జూన్ 3న జరగాల్సిన టైటిల్ పోరుకు ఈడెన్ గార్డెన్ ఆతిథ్యం ఇవ్వనుందనే వార్తలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి చెక్ పెట్టింది. వరసగా సమావేశాల అనంతరం చివరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం లోనే ఫైనల్ ఆడించాలని తీర్మానించింది. ఈ విషయాన్ని మంగళవారం బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. దాంతో, ఇన్నిరోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ఎండ్ కార్డ్ పడినట్టైంది.

### ముంబై ఇండియన్స్‌లోకి బెయిర్‌స్టో.. మరో ఇద్దరు కూడా..!




జాతీయ జట్టు విధుల కారణంగా ప్లే ఆఫ్స్‌కు దూరం కానున్న ర్యాన్ రికెల్టన్ (సౌతాఫ్రికా), కార్బిన్ బాష్ (సౌతాఫ్రికా), విల్ జాక్స్ (ఇంగ్లండ్) స్థానాలను ముంబై ఇండియన్స్ మరో ముగ్గురితో భర్తీ చేసుకుంది. విల్ జాక్స్‌కు ప్రత్యా?మ్నాయంగా జానీ బెయిర్‌స్టో (ఇంగ్లండ్), ర్యాన్ రికెల్టన్‌కు ప్రత్యామ్నాయంగా రిచర్డ్ గ్లీసన్ (ఇంగ్లండ్), కార్బిన్ బాష్‌కు ప్రత్యామ్నాయంగా చరిత్ అసలంకను (శ్రీలంక) జట్టులోకి తీసుకుంది. వీరు ముగ్గురు ఒకవేళ ?ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తే అందుబాటులో ఉంటారు. లీగ్ చివరి మ్యాచ్ వరకు జాక్స్, రికెల్టన్, బాష్ అందుబాటులో ఉంటారు. బెయిర్‌స్టోను ముంబై యాజమాన్యం రూ.5.25 కోట్లకు సొంతం చేసుకుంది. గ్లీసన్‌ను రూ. కోటికి, అసలంకను రూ. 75 లక్షలకు దక్కించుకుంది. ఇదిలా ఉంటే, ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటికే మూడు ప్లే ఆఫ్స్ బెర్త్‌లు (గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్) ఖరారయ్యాయి. మిగిలిన ఏకైక బెర్త్ కోసం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఇరు జట్లు తలో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా, వీరి ప్లే ఆఫ్స్ భవితవ్యం మే 21న జరిగే మ్యాచ్‌తో దాదాపుగా డిసైడైపోతుంది. ఆ రోజు ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ, ముంబై తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో ముంబై గెలిస్తే ఇంకో మ్యాచ్‌తో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఢిల్లీ గెలిచినా ప్లే ఆఫ్స్ బెర్త్ అప్పుడే ఖరారు కాదు. ఆ జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్‌పై (మే 24) కూడా గెలిస్తేనే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. ఒకవేళ ఢిల్లీ.. ముంబైపై గెలిచి, పంజాబ్ చేతిలో ఓడినా ప్లే ఆఫ్స్ బెర్త్‌పై సందిగ్ధత కొనసాగుతుంది. మే 26న జరిగే మ్యాచ్‌లో పంజాబ్‌పై గెలిస్తే ముంబై ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది. ఒకవేళ ముంబై ఆ మ్యాచ్‌లో కూడా ఓడితే లీగ్ నుంచి నిష్క్రమిస్తుంది. కాగా, నిన్నటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ చేతిలో ఓటమితో లక్నో సూపర్ జెయింట్స్ కూడా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో ఇదివరకే సీఎస్‌కే, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కేకేఆర్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించాయి. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్ లీగ్ దశలో తలో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. ఈ మ్యాచ్‌ల్లో జయాపజాలు టాప్-2 బెర్త్‌లను డిసైడ్ చేస్తాయి. లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యే సరికి టాప్-2 పోజిషన్స్‌లో ఉండే జట్లకు ప్లే ఆఫ్స్‌లో ఓ మ్యాచ్ ఓడినా మరో అవకాశం ఉంటుంది. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్లకు ఆ అవకాశం ఉండదు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓడే జట్టు లీగ్ నుంచి నిష్క్రమిస్తుంది.

### చరిత్ర సృష్టించిన లక్నో ప్లేయర్లు.. ఐపీఎల్‌లో ఇలా జరగడం? ఇదే తొలిసారి..!

ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ప్లేయర్లు సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. లీగ్‌లో మునుపెన్నడూ జరగని విధంగా ఈ సీజన్‌లో లక్నోకు చెందిన ముగ్గురు విదేశీ ఆటగాళ్లు 400 పరుగుల మార్కును దాటారు. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఓ సీజన్‌లో ఒకే ఫ్రాంచైజీకి చెందిన ముగ్గురు విదేశీ ఆటగాళ్లు 400 పరుగుల మార్కును దాటడం ఇదే మొదటిసారి. నిన్న (మే 19) సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో బ్యాటింగ్ త్రయం ఎయిడెన్ మార్క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ ఈ ఘనత సాధించింది. సీజన్ ప్రారంభం నుంచి భీకర ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ సత్తా చాటారు. ఈ మ్యాచ్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో.. మార్ష్ (61), మార్క్రమ్ (61), పూరన్ (45) సత్తా చాటడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌కు ముందే పూరన్ 400 పరుగులు పూర్తి చేయగా.. మార్క్రమ్, మార్ష్ ఈ మ్యాచ్‌లో 400 పరుగుల మైలురాయిని తాకారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన పూరన్ నాలుగు అర్ధ సెంచరీల సాయంతో 455 పరుగులు చేయగా.. మార్ష్ 11 మ్యాచ్‌ల్లో ఐదు అర్ధ సెంచరీల సాయంతో 443 పరుగులు.. మార్క్రమ్ 12 మ్యాచ్‌ల్లో ఐదు అర్ధ సెంచరీల సాయంతో 409 పరుగులు చేశారు. ఈ సీజన్ లీడింగ్ రన్ స్కోరర్ల జాబితాలో పూరన్ 9, మార్ష్ 10, మార్క్రమ్ 12 స్థానాల్లో ఉన్నారు. ఈ సీజన్‌లో ముగ్గురు విదేశీ బ్యాటర్లు అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నా లక్నో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోవడం సోచనీయం. నిన్న సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పూరన్, మార్ష్, మార్క్రమ్ సత్తా చాటినా లక్నో గెలవలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఓటమితో లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ సీజన్‌లో లక్నో తరఫున ఈ ముగ్గురు మినహా బ్యాటింగ్‌లో ఎవ్వరూ రాణించలేదు.



### ఒకప్పుడు కూరగాయలు అమ్మాడు..

# ఇప్పుడు స్టార్ యాక్టర్



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది నటులు తమ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. వీరిలో చాలా మంది బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన వారే. తమ స్వయం కృషితో సినిమా ఇండడస్ట్రీలో స్టార్స్ గా వెలుగొందిన వారే. ఈ ప్రముఖ నటుడు కూడా సరిగ్గా ఇదే కోవకు చెందుతాడు. ఈ నటుడు ఒకప్పుడు వాచ్‌మెన్‌గా పని చేశాడు. కెమిస్ట్‌గా పనిచేశాడు. కూరగాయలు అమ్మాడు.. ఇలా ఎన్నో రకాల పనులు చేశాడు. అదే సమయంలో సినిమా ఆడిషన్స్ కు హాజరయ్యాడు. మొదట అన్నింటా తిరస్కరణలే. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాడు. మొదట చిన్న చిన్న సినిమాల్లో అవకాశం వచ్చింది. ఎలాంటి మొహమాటం లేకుండా అన్ని పాత్రలు చేసుకుంటూ వెళ్లిపోయాడు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ క్రమంగా స్టార్ నటుడిగా తనను తాను నిరూపించుకున్నాడు. ప్రస్తుతం బాలీవుడ్ లో ది మోస్ట్ ట్యాలెంటెడ్ అండ్ వెర్స టైల్ యాక్టర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం ఈ యాక్టర్ బాలీవుడ్ తో పాటు తెలుగు, తమిళ్ భాషల్లోనూ సినిమాలు చేస్తోన్నాడు. తన డిమాండ్, క్రేజ్ కు తగ్గట్టుగానే సినిమాకు కోట్లాది రూపాయలు రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడు. ప్రస్తుతం ఈ నటుడి ఆస్తి సుమారు రూ. 200 కోట్లకు పైగానే ఉంటోంది. ఇక రాజభవనం లాంటి ఇల్లు, లగ్జరీ కార్లు ఇలా తన పడిన కష్టానికి ఇప్పుడు లగ్జరీ లైఫ్ ను ఆస్వాదిస్తున్నాడీ స్టార్ యాక్టర్. అతను మరెవరో కాదు బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ. ఆ మధ్యన విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ సినిమాలో విలన్ గా నటించాడు నవాజుద్దీన్ సిద్దిఖీ. అలాగే ఈ మధ్యన పలు దక్షిణాది సినిమాల్లోనూ మెరుస్తున్నాడు. ఇటీవల ఓ సందర్భంగా మాట్లాడిన నవాజుద్దీన్ తన సినిమా ప్రయాణం గురించి తన అనుభవాలను పంచుకున్నాడు. 'వడోదరలో ఒక నాటకం చూసినప్పుడు నాకు తొలిసారి నటనా అభిరుచి కలిగింది. 'మేము మా కుటుంబంతో కలిసి రాంలీలా నాటకం చూసే వాళ్లం. అదే నాకు నటనతో తొలి పరిచయం. నా స్నేహితుడు ఒకరు రామ్ పాత్ర పోషించాడు. వేదికపై అతన్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. అప్పుడు రాముడి పాత్రలో నన్ను నేను ఊహించుకునేవాడిని' అని నవాజుద్దీన్ అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు. కాగా కళాశాల చదువు పూర్తి చేసిన తర్వాత, నవాజుద్దీన్ వడోదరలో కెమిస్ట్ గా పనిచేశాడు. అతను అక్కడ ఒక నాటకం కూడా చూశాడు. ఆ రాత్రి, నటుడు కావాలనే కల అతని మనసులో బలంగా నాటుకుంది.ఆ తరువాత, నవాజుద్దీన్ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో అడ్మిషన్ పొందాడు. దీంతో అతని ప్రయాణం ముంబై చేరుకుంది. ' నేను ముంబైకి వచ్చినప్పుడు, ప్రతిదీ ఎంత వేగంగా జరుగుతుందో చూసి నేను ఆశ్చర్యపోయాను. ఈ నగరం వేగానికి అలవాటు పడటానికి నాకు ఒక నెల సమయం పట్టింది. నేను ఈ వేగానికి ఎప్పటికీ అలవాటు పడలేనని అనుకున్నాను' అని అప్పటి అనుభవాలను గుర్తు తెచ్చుకున్నాడు నవాజుద్దీన్.




## విడుదల తేదీ ప్రకటించిన 'రానా నాయుడు' సీజన్ 2

టాలీవుడ్ హీరోలు దగ్గుబాటి వెంకటేశ్ రానా కాంబోలో వచ్చిన నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ రానా నాయుడు అమెరికన్ హిట్ సిరీస్ రే డోనోవ్యాన్‌కు అడాప్షన్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో విడుదలయ్యి మంచి రికార్డు వ్యూస్ సాధించిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో తండ్రీ కొడుకులుగా నాగానాయుడు (వెంకటేశ్), రానా నాయుడు (రానా) మధ్య నడిచే ట్రాక్‌లో కొన్ని అభ్యంతరకర సన్నివేశాలు పక్కన పెడితే.. మిగిలిన ట్రాక్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది. అయితే ఈ సిరీస్‌కు సీజన్ 2 రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రానా నాయుడు సీజన్ 2 టీజర్‌ను కూడా విడుదల చేసింది నెట్‌ఫ్లిక్స్. అయితే ఇప్పుడు తాజాగా విడుదల అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ వెబ్ సిరీస్‌ను జూన్ 13న నెట్‌ఫ్లిక్స్ వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. కొత్త సీజన్‌లో విలన్‌గా బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ నటించబోతుండగా.. కరణ్ అన్షుమన్ దర్శకత్వం వహిస్తున్నాడు.




## 'వార్ 2' టీజర్‌కి సూపర్ రెస్పాన్స్

### అభిమానులకు ఎన్టీఆర్ కృతజ్ఞతలు

నేడు నందమూరి అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు కావడంతో ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఆయన నటిస్తున్న వార్ 2 నుంచి చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ యూట్యూబ్‌తో పాటు ఇతర సోషల్ మీడియాలో దూసుకుపోతుంది. అయితే ఈ టీజర్‌కి వస్తున్న రెస్పాన్స్‌కి సంబంధించి తన అభిమానులకు జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా ఒక నోట్ విడుదల చేశాడు. జూనియర్ ఎన్టీఆర్ తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తన సినీ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, ఎప్పుడూ అభిమానులే ముందుగా గుర్తుకొస్తారని ఆయన అన్నారు. "నాకు నిరంతరం తోడుగా ఉండి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన నా ప్రియమైన అభిమానులకు ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. 'వార్ 2' టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించడం పట్ల జూనియర్ ఎన్టీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. "వార్ 2 టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఆగస్టు 14న మీరందరూ సినిమాను చూడటానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆయన తెలిపారు. అలాగే, తన శ్రేయోభిలాషులు, మీడియా, చిత్ర పరిశ్రమలోని సహోద్యోగులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. "నా శ్రేయోభిలాషులందరికీ, మీడియాకు, చిత్ర పరిశ్రమలోని నా సహోద్యోగులకు మీ హృదయపూర్వక శుభాకాంక్షలకు బిగ్ థాంక్యూ. ఎప్పటికీ కృతజ్ఞుడిని" అంటూ తన ప్రేమను తెలియజేశారు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.



## తీవ్రమైన గాయాలతో రాశి ఖన్నా..

హీరోయిన్ రాశి ఖన్నా స్వల్పంగా గాయపడ్డారు. అందుకు సంబంధించిన ఫోటోలను ఆమె షేర్ చేశారు. ఒక సినిమా షూటింగ్‌లో కథ డిమాండ్ మేరకు చాలా రిష్క్ ఉన్న యాక్షన్ సీన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అందువల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా 'ది సబర్మతి రిపోర్ట్'తో మెప్పించిన ఆమె 'ఫర్జీ2' వెబ్ సిరీస్ చేస్తుంది. ఇందులో భాగంగానే ఆమెకు గాయాలు అయినట్లు సమాచారం. గాయాలతో ఉన్న ఫోటోలు షేర్ చేసిన రాశి ఖన్నా ఇలా చెప్పుకొచ్చింది. 'ఒక్కోసారి కథ డిమాండ్ చేస్తే గాయలను కూడా లెక్కచేయకూడదు. ఈ క్రమంలో మీ గాయాలు కూడా ఒక్కోసారి మీ శరీరం, మీ శ్వాస మీద ప్రభావం చూపవచ్చు.' అంటూ పోస్ట్ చేసింది. షూటింగ్‌లో చిన్నచిన్న గాయాలైనట్లు రాశి ఖన్నా తెలిపింది. కాగా.. రాశీ ఖన్నా దాదాపు ఒక దశాబ్దం పాటు అనేక తెలుగు, తమిళ స్టార్ హీరోల చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. 2013లో హిందీ చిత్రం మద్రాస్ కేఫ్‌తో అరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ.. ఆ తర్వాత సౌత్ సినిమాల్లోకి ప్రవేశించింది. ఎందుకంటే ఆమెకు హిందీలో కలిసి రాకపోవడంతో సౌత్‌వైపు అడుగులేసింది. అయితే 2022లో రుద్ర: ది ఎడ్జ్ ఆఫ్ డార్క్‌నెస్ అనే సైకలాజికల్ క్రైమ్ సిరీస్‌తో హిందీ పరిశ్రమలో రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రంలో అజయ్ దేవగన్‌తో కలిసి నటించింది. ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే చిత్రంలో కనిపించనుంది. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన నటిస్తోంది. ఇందులో కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి కూడా హీరోయిన్‌గా చేయనుంది.

### సుమంత్ అనగనగా చిత్రానికి ప్రేక్షకులు ఫిదా..

## స్ట్రీమింగ్ మినిట్స్‌లో రికార్డ్ ఫీట్

టాలీవుడ్ యాక్టర్ సుమంత్ లీడ్ రోల్‌లో నటించిన ఈటీవీ విన్ ఒరిజినల్ చిత్రం అనగనగా సన్నీ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సుమంత్ వ్యాస్ సార్‌గా నటించాడు. అనగనగా మే 15న ప్రేక్షకుల ముందుకొచ్చిందని తెలిసిందే. ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. నిజాయితీతో కూడిన స్టోరీ టెల్లింగ్, సుమంత్ ఇతర సహాయ నటీనటుల మధ్య సాగే భావోద్వేగపూరిత సన్నివేశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. కాగా ఈ చిత్రం అరుదైన మైల్‌స్టోన్‌ను చేరుకుంది. అనగనగా 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. కొత్తదనంతో కూడిన సినిమాలు చేసే విషయంలో ఎప్పుడూ ముందుండే సుమంత్ సరైన కథతో ప్రేక్షకుల ముందుకొచ్చి అందరినీ ఇంప్రెస్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో కాజల్ చౌదరి హీరోయిన్‌గా నటించగా.. మాస్టర్ విహర్ష్, అవసరాల శ్రీనివాస్, అనుహాసన్, రాకేశ్ రాచకొండ ఇతర కీలక పాత్రల్లో నటించారు. చందు రవి సంగీతం అందించాడు.




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com